తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4

సంచిక : 06

పేజీలు - 8

వెల- రూ 5 : 00

prajamantalu.com

# ప్రజా మంటలు

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

మంగళవారం 23, మే 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri


## 50 వేలు దాటితే పాన్ తప్పనిసరి



- 2వేల నోట్ల మార్పిడి : ఆర్‌బిఐ గైడ్‌లైన్స్ విడుదల

**ముంబై,మే22(ప్రజా మంటలు):** రూ. 2 వేల నోట్లను భారతీయ రిజర్వ్ బ్యాంకు ఉప సంహ రించుకున్న దరిమిలా వాటిని మర్చు కునే వారు 50వేల పరిమితిని మించితే పాన్ సమర్పించాల్సిందేనని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. మంగళవారం

మిగతా... 2లో



## కమిషన్ల కోసమే ప్రాజెక్టులు

- కమిషన్ల చంద్రశేఖర్ రావు
- ప్రాజెక్టుల రీ డిజైన్ అందుకే
- కెసిఆర్ ఉన్నంతవరకు రైతులకు శాపమే
- లక్ష్మీదేవిపట్టి ఆందోళనకు షర్మిల మద్దతు

**రంగారెడ్డి,మే22(ప్రజా మంటలు):** కమిషన్ల కోసమే కేసీఆర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేశారని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. కమిషన్ల కోసమే రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను కాంట్రాక్టర్ మెఘా కృష్ణారెడ్డికి కట్టబెడుతున్నారని వెల్లడించారు. పాలమూరు, మిషన్ భగీరథ ఇలా అన్ని కాంట్రాక్టులు మెఘా కృష్ణారెడ్డికే ఇస్తున్నారని.. ఎందుకంటే మెఘా కృష్ణారెడ్డి

మిగతా... 2లో

## జివో 111 రద్దు..

# భూ మాఫియా కోసమే..

- జివో 111 రద్దు వెనక భారీ కుట్ర
- హైదరాబాద్ జంటనగరాలను ధ్వంసం చేసే కుట్ర
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మే22(ప్రజా మంటలు):** కేసీఆర్ మాఫియా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మండి పడ్డారు. ధనదాహం కోసమే 111 జీవో రద్దు చేసి.. జంట నగరాలపై బాంబు వేశాడని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలు విధ్వంసం చేసేందుకు కుట్ర పన్నాడన్నారు. ఈ విధ్వంసం వెనుక భారీ భూ కుంభకోణం ఉందన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్, ఆయన బినామీల కోసమే 111జీవోను రద్దు చేశారన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన భూ లావాదేవీలను బహిరంగ పర్చాలని డిమాండ్ చేశారు. పీజేఆర్ పోరాటం వల్లే కృష్ణా జలాలు హైదరాబాద్‌కు వచ్చాయన్నారు. కాంగ్రెస్ హయాంలో గోదావరి జలాలు హైదరాబాద్ సిటీకి వచ్చాయని వివరించారు. హైదరాబాద్ సిటీ దాహం తీర్చిన జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్



సాగర్ లను నాశనం చేస్తారా అని ప్రశ్నించారు. గతంలోనే రూపాయి ఖర్చు లేకుండా పైపు లైన్లు వేశామన్న కేసీఆర్.. ఇప్పుడు పైపుల కంపెనీల దగ్గర కమిషన్ల కోసమే కొత్త నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. తెలంగాణలో బినామీ యాక్టు పర్ఫెక్ట్‌గా అమలవుతోందన్నారు. దోపిడీలో వాటా లేకపోతే కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో బండి సంజయ్, కిషన్ రెడ్డిలు చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ రంకెలెయ్యడం కాదు... 111 జీవో రద్దుపై దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయాలన్నారు. కేసీఆర్‌ను ఉప్పు కారం పెట్టి కొట్టినా తప్పులేదంటూ వ్యాఖ్యలు చేశారు. బందిపోట్లనైనా క్షమించవచ్చు కానీ... కేసీఆర్, కేటీఆర్‌ను క్షమించలేమన్నారు. 111 జీవో రద్దుపై కాంగ్రెస్ పార్టీ తరపున నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేసీఆర్ నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం వరదల్లో మునిగి వేల మంది చనిపోయే పరిస్థితి వస్తుందన్నారు. 111 జీవో పరిధిలో టీఆర్‌ఎస్ వాళ్ళు వందలాది ఎకరాలు కొన్నారని.. 111జీవో ప్రాంతానికి తాగునీటి సమస్య కానేకాదన్నారు. బ్రిటిష్ రాజులు, నిజాం ప్రభువులు, సమైక్య పాలకులు హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తూ వచ్చారన్నారు. దుర్మార్గులైన బ్రిటిష్, నిజాం, సమైక్య పాలకులకన్నా కేసీఆర్ దుర్మరంగా

మిగతా... 2లో

## మోడీకి ఫిజీ అత్యున్నత పురస్కారం

- ది కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీతో సత్కారం

**న్యూఢిల్లీ,మే22(ప్రజా మంటలు):** మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫిజీ అత్యున్నత పౌర పురస్కారం లభించింది.ప్రధాని మోదీ వహించిన ప్రపంచ నాయకత్వానికి గానూ 'ది కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ'తో సత్కరించారు.ప్రధాని మోదీ ఫిజీ దేశానికి చెందిన సితివేణి రబుకా నుంచి పతకాన్ని అందుకున్నారు. ఫిజియేతర వ్యక్తికి అరుదైన గౌరవంగా పిఎం మోదీని పౌర పురస్కారంతో సత్కరించారు.' ఫిజీ పౌర పురస్కారం మన ప్రధానికి దక్కడం భారతదేశానికి పెద్ద గౌరవం. మోదీ ప్రపంచ నాయకత్వానికి గుర్తింపుగా ఫిజియేతరులు కొద్దిమంది మాత్రమే ఈ గౌరవాన్ని అందుకున్నారు' అని ప్రధాన



మంత్రి కార్యాలయం తెలిపింది. రెండు దేశాల మధ్య మైత్రిలో కీలక పాత్ర పోషించిన భారత ప్రజలకు, ఫిజీ-ఇండియన్ ప్రజలకు ప్రధాని మోదీ ఈ గౌరవాన్ని అంకితం చేశారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ట్విట్టర్‌లో తెలిపింది.పాపువా న్యూ గినియాలో ఫోరమ్ ఫర్ ఇండియా-పసిఫిక్ ఐలాండ్స్ కోఆపరేషన్ (ఎఫ్ఐపిఐసి) సమ్మిట్

మిగతా... 2లో

## జాతీయ రాజకీయాల్లో మార్పు

- నితీశ్ ఎంటర్‌తో కెసిఆర్ సైలెంట్
- కెసిఆర్ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వని నేతలు

**న్యూఢిల్లీ,మే22(ప్రజా మంటలు):** నితీశ్ కుమార్ ఇప్పుడు ఆనాటి కెసిఆర్ పాత్ర పోషిస్తున్నారు. రాజకీయ పార్టీలను,నేతలకు కలుస్తూ ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్‌ను కలుపుకుని ముందుకు సాగాలన్న ఐక్యతా రాగం వినిపిస్తున్నారు. కర్నాటక సిఎం ప్రమాణ స్వీకారోత్సవంలో అన్ని పార్టీల నేతలు మరోమారు వేదిక పంచుకోవడంతో ఐక్యతకు కొంత బలం చేకూరిందని భావించాలి. అయితే కెసిఆర్, మమతా బెనర్జీ,అఖిఏశ్ యాదవ్ తప్ప అంతా హాజరయ్యారు. ఇందుకో కెసిఆర్ ఎజెండా వేరు. అక్కడికి హాజరయితే .. తెలంగాణలో కాంగ్రెస్‌తో మిలాఖత్ అయినట్లుగా ప్రజలకు సందేశం వెళుతుందన్న బయం ఉంది. అందుకే ఆయన వెళ్లలేకపోయి ఉంటారు. ఇకపోతే మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్‌ల సంగతి తెలియాల్సి

మిగతా... 2లో






## బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం

# బిజెపి మాత్రమే..

ప్రజలతో సంబంధం ఉన్నవారికే టిక్కెట్లు

సర్వే నివేదికల ఆధారంగానే టిక్కెట్ల కేటాయింపు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో బండి సంజయ్ వ్యాఖ్యలు

**హైదరాబాద్,మే22(ప్రజా మంటలు):** నిత్యం ప్రజల్లో తిరుగుతూ ఓటర్లను కలిసే నేతలకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లోని చంపాపేటలో సోమవారం బండి సంజయ్ అధ్యక్షతన ప్రారంభమైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. పలు సర్వేలు నిర్వహించి, నివేదికల ఆధారంగానే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ లు ఇస్తామని ప్రకటించారు. ప్రజలంతా బీజేపీ మాత్రమే బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం అవుతుందని నమ్ముతున్నారు. కాంగ్రెస్ లో ఉన్న 5 గురు ఎమ్మెల్యేల్లో నలుగురు నాలుగు దిక్కులు చూస్తూ నాలుగు స్థంభాలాట ఆడుతుంటే... ఒకాయన మాత్రం చౌరస్తాలో నిలబడి ఏం చేయాలో తెల్వక చూస్తున్నడు అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని, అప్పుడే అన్ని కేంద్ర, సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతాయని చెప్పారు. మిషన్ భగీరథ పెద్ద స్కాం అని ఆరోపించారు. కేసీఆర్ సర్కార్ అక్రమాలు, అవినీతి, వైఫల్యాలపై బీజేపీ నిలదీస్తుంటే కేసీఆర్ ఓర్వలేకపోతున్నడు. ఒకనాడు మోదీని విశ్వగురుగా, నిజాయితీపరుడిగా కీర్తించిన కేసీఆరే ఇయాళ అవినీతి పరుడు, రాక్షసుడంటూ తిడుతున్నడు. బీజేపీని ఓడించేందుకు దేశమంతా తిరుగుతూ పైసలు పంచుతు న్నడు. కేసీఆర్ విశ్వాస ఘాతకుడిని నా రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదు. కేసీఆర్ ఎంతటి విశ్వాసఘాతకుడంటే మొన్నటి

మిగతా... 2లో

## అవినాశ్ రెడ్డికి దక్కని ఊరట



- బెటియ్ పిటిషన్ విచారణకు సుప్రీం నో
- విశ్వభారతి ఆస్పత్రి ఎదుట ఉద్రిక్తత

**న్యూఢిల్లీ,మే22(ప్రజా మంటలు):** వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. బెయిల్ పిటిషన్ విచారణకు వెకేషన్ బెంచ్ నిరాకరించింది. దీంతో అవినాశ్‌ను అరెస్ట్ చేయడానికి సీబీఐకి అడ్డంకి తొలగిట్టయ్యింది. మెన్షనింగ్ లిస్ట్‌లో ఉంటేనే విచారిస్తామని.. జడ్జిలు సంజయ్ కరోల్, అనిరుధ్ బోస్ ధర్మాసనం వెల్లడించింది. మెన్షనింగ్ ఆఫీసర్ ముందుకు వెళ్లాలని న్యాయమూర్తి అనిరుధ్ బోస్ ధర్మాసనం సూచించింది. న్యాయమూర్తి సంజయ్ కరోల్ ధర్మాసనం ముందు విచారణకు వేయవద్దని మెన్షనింగ్ ఆఫీసర్‌కి

మిగతా... 2లో



## వైద్యవిద్యతో పాటు ఆస్పత్రుల

# బలోపేతం...

- కొత్త మెడికల్ కాలేజీల్లో సిబ్బంది నియామకం
- పెరిగిన దవాఖానలకు అనుగుణంగా వైద్యసిబ్బంది
- కొత్తగా 1061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నియామక పత్రాలు
- అందచేసిన మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,మే22(ప్రజా మంటలు):** ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేసేందుకే కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. జిల్లాకో వైద్యకళాశాలతో పాటు అధునాతన వైద్యశాల రాబోతున్నదని అన్నారు. పెరిగిన దవాఖానలకు అనుగుణంగా వైద్యసిబ్బంది నియామకాలు జరుపుతున్నామని చెప్పారు. అత్యంత పారదర్శకంగా నియామకాలు చేస్తున్నామని వెల్లడిం చారు. ఒకేరోజు 1,061 మంది అసిస్టెంట్ ప్రొఫె సర్లను నియమించామని, వైద్య విద్యలో దేశంలోనే ఇది ఒక రికార్డని చెప్పారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో కొత్తగా నియమితులైన 1061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నియామక పత్రాలను

మిగతా... 2లో

## ప్రజానాడి




## మత్స్యసహకార సంస్థ ఛైర్మన్‌గా పిట్టల

- మంత్రి తలసాని సమక్షంలో బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్,మే22(ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్ర మత్స్య, సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా పిట్టల రవీందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మాసబ్ట్యాంక్‌లోని మత్స్య శాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని రవీందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు దూదిమెట్ల బాలరాజు యాదవ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, దామోదర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ కారుడు, మత్స్యరంగ నిపుణుడు, జర్నలిస్ట్ పిట్టల రవీందర్‌ను తెలంగాణ రాష్ట్ర మత్స్య, సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించిన సంగతి తెలిసిందే. వైస్ చైర్మన్‌గా గంగపుత్ర సంఘాల సీనియర్ నాయకుడు దీటి మల్లయ్య నియమితులయ్యారు. కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన



పిట్టల రవీందర్ సుదీర్ఘకాలం జర్నలిస్టుగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో కో-కన్వీనర్‌గా వ్యవహరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రామాంతపూర్‌కు చెందిన దీటి మల్లయ్య ఉద్యమకారుడిగా, మత్స్యరంగ నిపుణుడిగా విశేష సేవలు అందించారు.

# జాతీయ రాజకీయాల్లో మార్పు

**మొదటిపేజీ తరువాయి..**

ఉంది. అయితే కెసిఆర్ రాజకీయంగా ఎత్తులు వేయడంలో దిట్ట. ఆయన రాజకీయ సోపానపటం పరిశీలిస్తే నిచ్చెన మెట్లు ఎక్కడమే తప్ప దిగడం తెలియదు. ఇప్పుడు కెసిఆర్ కేవలం మహారాష్ట్రపైనే దృష్టి సారించిఆరు. వరసగా అక్కడికి వెళ్లడం, పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం చూస్తుంటే ఆయన పక్కా ప్లాన్‌తోనే వెళుతున్నారు. మోడీకి ప్రత్యామ్నాయంగా కూటమి కట్టాలన్న ఉద్దేశ్యంతో ఉన్నా మిగతా పార్టీలు బిఆర్ఎస్‌కు ఎంతమాత్రం సహకరించడం లేదు. ప్రాంతీయ పార్టీల మధ్య ఐక్యత లేకుండా ముందుకు సాగడం కష్టమని గుర్తించాలి. బలమైన మోడీని ఢీకొనాలంటే చలిచీమల లాంటి పార్టీలు ఏకమవ్వాలి. అందుకు కెసిఆర్ నాయకత్వాన్ని అన్ని పార్టీలు బలపరచగలగాలి. అలాగే ఆయన కూడా వీటిని పెద్దగా సీరియస్‌గా తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు. జాతీయస్థాయిలో కాంగ్రెస్, బిజెపిలను ఢీ కొంటానని ప్రకటనలు చేసినందున బీజేపీతో అంటకాగుతారనడానికి లేదు. అలాగే బిజెపి కూడా ఆయనను టార్గెట్ చేయడానికి ఉన్న అవకాశాలను వెతుకుతూనే ఉంటుంది. కేసీఆర్ ప్రభుత్వంలో అవినీతి ఎక్కడెక్కడ జరిగింది అని కమలనాథులు ఆరా తీయడం మొదలు పెట్టారనే అంటున్నారు. బలమైన ఆధారాలు లభిస్తే కేసీఆర్‌ను, జగన్ను లేదా మమతా బెనర్జీల్లో ఎవరిని కూడా కమలనాథులు వదలబోరు. కేసుల్లో ఇరికించి మరింత బలహీనపరిచే ఎత్తుగడలకు బీజేపీ నాయకులు పదును పెడుతూనే ఉంటారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అజేయుడిగా ఉంటూ వచ్చిన కేసీఆర్‌ను అప్పుడప్పుడూ కొంత చికాకు కలవరపరిచినా విజయాలు పలకరి వస్తున్నాయి. రానున్న ఎన్నికల్లో కూడా 105 సీట్లు గెలుస్తామన్న ధీమాతో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చొరవ తీసుకున్న కాంగ్రెస్ పార్టీ నిస్సహాయంగా నిలబడింది. అయితే కర్నాటక విజయంతో కొంత ఆత్మవిశ్వాసం పెరిగింది. తెలంగాణలో తృతీయ స్థానంలో ఉన్న భారతీయ జనతాపార్టీ కేసీఆర్‌కు పెనుసవాళ్లు విసురుతోంది. తెలంగాణ రాష్ట్రసమితిని ఇంటిపార్టీగా ప్రచారం చేసి, రాష్ట్రంలో మరో రాజకీయ పార్టీ అవసరం ఉందా? అని ప్రశ్నిస్తూ వచ్చిన కేసీఆర్‌కు ఇప్పుడు బిజెపి సవాల్‌గా నిలిచింది. ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల విముఖత ఏర్పరుచుకున్న ప్రజలు బీజేపీలో ప్రత్యామ్నాయాన్ని చూడటం మొదలుపెట్టారు. కేసీఆర్‌ను దెబ్బ కొట్టాలంటే బీజేపీని ఆశ్రయించక తప్పని పరిస్థితి తెలంగాణలో ఏర్పడిందన్న భావన ఏర్పడింది.బిజెపిని ఎదుర్కొంటే కప్పల తక్కెడ లాంటి ప్రాంతీయ పార్టీల మధ్య సయోధ్ కుదర్చడం ఎంతవరకు విజయం సాధిస్తారన్నది ముఖ్యం. జాతీయ రాజకీయాల్లో మార్పు తీసుకొచ్చే దిశగా చేస్తున్న ప్రయత్నాలపై ఇప్పుడు ఎలా ముందుకు వెళతారన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.అందరి దృష్టిని తనవైపునకు తిప్పుకొని, దేశంలో ఏ రకమైన చర్చ పెడుతారోనని రాజకీయ పార్టీల నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కేసీఆర్ ఎంచుకొన్న కార్యక్రమాలు, వాటి చుట్టూ అల్లుకొన్న రాజకీయాలు, వివక్షపై గొంతెత్తి తన వాదన సరైనదని.. జాతీయ రాజకీయాల్లో మార్పు రావాల్సిందేననే దిశగా ప్రజలను ఆలోచింపజేస్తారని విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే బలమైన కేంద్రం-బలహీన రాష్ట్రాలు, బలవంతపు సంస్కరణల అమలు, నిధుల కేటాయింపులో వివక్ష వంటి అంశాలపై రాష్ట్రాల హక్కులను బలంగా ప్రశిస్తున్న కేసీఆర్.. నితీశ్ ఎంటర్‌తో సైలెంట్ అయ్యారు. దేశ వ్యవసాయ రంగం, సాగునీరు, తాగునీరు, ఆర్థికపరిస్థితులు, రాజకీయ పరిస్థితులు వంటి అంశాలపై కెసిఆర్ నిరంతరం చర్చ చేస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతున్నారు. అయితే నితీశ్‌కు వచ్చిన ప్రాముఖ్యం ఇప్పుడు కెసిఆర్‌కు రావడం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## మోడీకి ఫిజీ అత్యున్నత పురస్కారం

**మొదటిపేజీ తరువాయి..**

సందర్భంగా ప్రధాని మోదీ రబుకాను కలిశారు.భారతదేశం, ఫిజీ దేశాల మధ్య సంబంధాలు రాబోయే సంవత్సరాల్లో మరింత పటిష్ఠం చేసేందుకు కలిసి పనిచేయడానికి మేం ఎదురుచూస్తున్నామని ప్రధాన మంత్రి అని మోదీ ట్వీట్ చేశారు.ప్రధాని మోదీకి గతంలో పలు దేశాలు అత్యున్నత పౌర పురస్కారాలు అందించాయి.

## ఖమ్మం రాజకీయాల్లో

# పొంగులేటి బచ్చా

### డబ్బు మదంతో విర్రవీగుతున్నాడు

### మంత్రి పువ్వాడ అజయ్ ఆగ్రహం

**ఖమ్మం,మే22(ప్రజా మంటలు):** మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డబ్బు బలం చూసుకుని విర్రవీగుతున్నాడని మంత్రి పువ్వాడ అజయ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్‌లో ఉంటూ సొంత పార్టీ నేతలనే



ఓడించాలని కుట్ర చేసిన చరిత్ర పొంగులేటిదని ఆరోపించారు. తనను తాను అతిగా ఊహించుకుంటున్నాడని, ఆయనకు ఓ సిద్ధాంతం, విలువ లేవని విమర్శించారు. ఏ పార్టీలోకి పోవాలో తేల్చుకోలేని దుస్థితిలో పొంగులేటి ఉన్నాడని ధ్వజమెత్తారు.

వచ్చే ఎన్నికల్లో ఖమ్మంలో పువ్వాడ అజయ్ ఓటమి ఖాయమని పొంగులేటి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఘాటుగా స్పందించారు. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో పొంగులేటి ఒక బచ్చా అని అన్నారు. పేదలను దోచిన దోపిడీదారులే పొంగులేటి పంచన చేరారని విమర్శించారు. పద్ధతి మార్చుకోవాలని సీఎం కేసీఆర్ ఎన్నిసార్లు చెప్పినా మారలేదని చెప్పారు. ÷ఖఆర్ఎస్‌లో ఉండి బాగా సంపాదించాడని, ఇప్పుడు అదే డబ్బుతో రాజకీయ చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. పొంగులేటి డబ్బులకు ఖమ్మం ప్రజలు అమ్ముడుపోరని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పుడు ఆయన ఆర్థిక పరిస్థితి ఏంటి.. ఇవాళ ఎలాంటి స్థితిలో ఉన్నాడని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను ఉపయోగించుకుని వేల కోట్ల రూపాయలు సంపాదించాడని చెప్పారు. కాంట్రాక్టర్‌గా పనులు చేయకుండానే వందల కోట్లు బొక్కావని ఆరోపించారు. ఏ పార్టీలోకి వెళ్లాలో తేల్చుకోలేక ఫ్రస్టేషన్‌లో ఉన్నారని, అందుకే బీఆర్ఎస్‌ను విమర్శిస్తున్నారని వెల్లడించారు. పొంగులేటి ఆత్మీయ సమావేశాలకు జనాల స్పందన కరువైందని విమర్శించారు. ఖమ్మం అభివృద్ధిమీద కొందరు కడుపులో విషం నింపుకున్నారని చెప్పారు.

## అవినాశ్ రెడ్డికి

# దక్కని ఊరట

**మొదటిపేజీ తరువాయి..**

ధర్మాసనం సూచించింది. గతంలో హైకోర్టు వేకేషన్ బెంచ్‌ను తన బెయిల్ పిటిషన్ విచారించేలా ఆదేశించాలని సుప్రీంలో అవినాశ్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణ తేదీని సుప్రీంకోర్టు ఖరారు చేయలేదు. జూన్ రెండోవారంలో విచారణకు అనుమతిస్తామని చెప్పిన సీజేఐ డివై చంద్రచూడ్ ధర్మాసనం వెల్లడించింది. ఈ రోజు సీబీఐ అరెస్ట్ చేసే అవకాశం ఉన్నందున మళ్లీ సుప్రీం వెకేషన్ బెంచ్ ముందు తన బెయిల్ పిటిషన్‌ను అవినాశ్ మెన్షన్ చేశారు. హైకోర్టు వెకేషన్ బెంచ్ ముందు బెయిల్ పిటిషన్ దాఖలు చేసేంత వరకూ తనను సీబీఐ అరెస్ట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంను కోరుతున్నారు. దీంతో మంగళవారం మళ్లీ సుప్రీం కోర్టు వెకేషన్ బెంచ్ ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. కడప ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. వెకేషన్ బెంచ్ జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ నరసింహ ధర్మాసనం ముందు అవినాష్ న్యాయవాది మెన్షన్ చేశారు. పిటిషన్ తమ ముందుకు విచారణకు రావట్లేదని.. మరో వెకేషన్ బెంచ్ ముందుకు వెళ్లాలని సుప్రీంకోర్టు సూచించింది. దీంతో మరో వెకేషన్ బెంచ్ ముందుకు అవినాష్ తరపు న్యాయవాది వెళ్లారు. మరోవైపు విశ్వభారతి హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆసుపత్రి వద్ద పోలీసు బలగాలు మోహరించాయి. ఎవ్వరినీ లోనికి రానీయకుండా బారికేడ్లను ఉంచారు. అవినాష్ రెడ్డిని అరెస్టు చేస్తే అడ్డుకోవాలని వైసిపి కార్యకర్తలు ఇప్పటికే ఆసుపత్రి వద్దకు భారీగా చేరుకున్నారు. శాంతిభద్రతల అంశంపై సిబిఐ అధికారులు పోలీసులతో చర్చలు జరుపుతున్నారు.

## 50 వేలు దాటితే పాన్ తప్పనిసరి

**మొదటిపేజీ తరువాయి..**

నుంచి బ్యాంకు లతో పాటుగా దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో రూ. 2 వేల నోట్లను మార్చుకునే అవకాశాన్ని కలిపించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంకులకు గైడ్ లైన్స్ విడుదల చేసింది. నోట్లను మార్చుకునేందుకు సాధారణ పద్ధతిలోనే ప్రజలకు అందించాలని దేశవ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంకులకు ఆర్బీఐ సూచించింది. ఇందుకు సంబంధించి ప్రొఫార్మాను విడుదల చేసింది. బ్యాంకులు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రింకింగ్ వాటర్ సదుపాయాన్ని కల్పించాలని సూచించింది. మరోవైపు రెండు వేల నోటును ప్రవేశపెట్టిన లక్ష్యం నెరవేరిందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ అన్నారు. దేశంలో రెండువేల నోటు సర్క్యులేషన్ గణనీయంగా తగ్గిందని చెప్పారు. టాక్స్ కట్టని వారిపై ఈడీ, సీబీఐ నిఘా ఉంటుదని తెలిపారు. రూ.2 వేల రూపాయల కరెన్సీ నోట్లు సెప్టెంబర్ 30 వరకు చట్టబద్ధంగా కొనసాగుతున్నాయని, దుకాణాలు వాటిని తిరస్కరించలేవని శక్తికాంతి దాస్ తెలిపారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు, డినామినేషన్‌ను మార్చుకోవడానికి తగినంత సమయం కేటాయించామని తెలిపారు. 2023 సెప్టెంబర్ 30లోగా రూ.2000 నోట్లను మార్చుకోవాలని వెల్లడించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ మే 19 రూ. 2 వేల నోట్లను ఉపసంహరించుకుంది. మే 23 నుంచి ఆర్‌బీఐ రీజనల్ ఆఫీసుల్లో 2 వేల నోట్లను మార్చుకోవచ్చని ఆర్బీఐ పేర్కొంది. రూ. 2 వేల నోట్లను సర్క్యులేషన్‌లో ఉంచొద్దని బ్యాంక్‌లకు ఆదేశించింది. దేశంలో వున్న 19 ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో రూ.2 వేల నోట్ల మార్పిడికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది.

గత కొద్ది కాలంగా రూ. 2 వేల నోట్లు మార్కెట్లో చలామణి కావడం లేదు. రూ. 1000 స్థానంలో రూ. 2 వేల నోటును కేంద్రం తీసుకొచ్చింది. 2016లో పాత నోట్లను రద్దు చేసి కొత్త నోట్లను చలామణిలోకి తీసుకొచ్చింది. అప్పటి నుంచి చెలామణిలో ఉన్న రూ. 2వేల నోట్లను.. క్లీన్ నోట్ పాలసీలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉపసంహరించుకున్నది.

## 2వేల నోట్ల రద్దు మూర్ఖపు చర్య

### మండిపడ్డ మాజీ ఆర్థికమంత్రి చిదంబరం

**న్యూఢిల్లీ,మే22(ప్రజా మంటలు):** కేంద్రం రూ.2,000 నోట్లను నగదు చెలామణీ నుండి ఉపసంహరించుకోవడంపై మాజీ ఆర్థిక మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం సోమవారం తీవ్రంగా స్పందించారు. రూ.2,000 నోట్లను ఉపసంహరించుకోవడం మోడీ ప్రభుత్వపు మూర్ఖపు చర్య అని మండిపడ్డారు. నల్లధనం మార్చు కునే బడా కార్పోరేట్లకు మోడీ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచిందని ధ్వజమెత్తారు. 2016 నాటి పెద్ద నోట్ల రద్దు అనంతరం మోడీ ప్రభుత్వం మరోసారి నల్ల ధనాన్ని వెలికి



తీసేందుకు మరోసారి రూ. 2,000 నోట్లను ఉపసంహరించుకుంటోందని ఎద్దేవా చేశారు. సాధారణ ప్రజల వద్ద రూ.2,000 నోట్లు లేవని అన్నారు. రోజువారీ చిల్లర నగదు మార్పిడికి అవి పనికిరావని, 2016లో వాటిని ప్రవేశపెట్టినా ప్రజలు పెద్దగా పట్టించుకోలేదని అన్నారు. దాని అర్థం రూ.2,000 నోట్లు ఎవరి వద్ద అధికంగా ఉంటాయనేది అందరికీ తెలుసు. నల్ల ధనాన్ని కాపాడుకునేవారికి ఇవి సహాయపడ్డాయి. ఇప్పుడు వారు తమ నోట్లను మార్చుకు నేందుకు రెడ్ కార్పెట్‌పై మోడీ ప్రభుత్వం స్వాగతం పలుకుతోందని ట్వీట్ చేశారు. 2016లో రూ.2,000 నోటును ప్రవేశపెట్టడం ఓ మూర్ఖపు చర్య అయితే ఏడేళ్ల అనంతరం ఆ మూర్ఖపు చర్యను వెనక్కి తీసుకున్నందుకు తాను సంతోషిస్తున్నానని అన్నారు.

## బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం

# బిజెపి మాత్రమే..

**మొదటిపేజీ తరువాయి..**

కర్నాటక ఎన్నికల్లో జేడీఎస్‌ను మోసం చేసిండు.. తెలంగాణ కోసం మొదటి నుండి నిలబడి కలబడి పార్లమెంట్ బిల్లు పాస్ చేయించిన సుష్మా స్వరాజ్ ను తెలంగాణ చిన్నమ్మ అని సంబోధించిన నోటితోనే దూషించారు. 2004లో కాంగ్రెస్ తో పొత్తుపెట్టుకుని ఆ పార్టీని, 2009లో టీడీపీతో పొత్తు పెట్టుకుని ఆ తరువాత బయటకొచ్చి ఆ పార్టీని మోసం చేసిండు. 2004లో కమ్యూనిస్టు పార్టీలను తోక పార్టీలని, సూది దబ్బడం పార్టీలని తిట్టిన నోరే... ఇయాళ తన అవసరం కోసం కమ్యూనిస్టు పార్టీలను చంకనేసుకుని తిరుగుతున్నడు.. దేశాన్ని కాంగ్రెస్, నెహ్రూ కుటుంబం మోసం చేస్తే అవసరం తీరాక ఆ కాంగ్రెస్ ను, ఆ కుటుంబాన్ని మోసం చేసిన ఘనుడు కేసీఆర్... అంతెందుకు కర్నాటక ఎన్నికల దాకా జేడీఎస్ కు నిధులు పంపి జట్టు కట్టిన కేసీఆర్... ఆ వెంటనే ఆ పార్టీని వదిలేసి కాంగ్రెస్ తో జతకట్టారు.. తెలంగాణ కోసం బొంత పురుగునైనా కౌగిలించుకుంటానన్న కేసీఆర్ అసలు నైజం అది కాదు... తన స్వార్థం కోసం, తన కుటుంబం ప్రయోజాల కోసం బొంత పురుగునైనా నమిలి మింగేసే రకం కేసీఆర్’ అని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. లాఠీలకు భయపడకుండా కేసులకు బెదరకుండా ఉద్యమిస్తున్నది బీజేపీ. జైళ్లకు పోతున్నది బీజేపీ. ప్రజలంతా ఇయాళ కేసీఆర్ ను ఢీ కొట్టేది బీజేపీయేనని భావనతో ఉన్నరు. బీజేపీ అధికారంలోకి వస్తేనే మేలు జరుగుతుందని నమ్ముతున్నరు. 2018 నుండి బీజేపీ గ్రాఫ్ పెరుగుతూ వస్తోంది. అందుకే గత మూడేళ్లుగా ఏ ఎన్నికలు జరిగినా బీజేపీని ఆదరిస్తూ వస్తున్నారు. దుబ్బాక ఉప ఎన్నిక నుండి మొదలు పెడితే... జీహెచ్ఎంసీ, హుజూరాబాద్, మునుగోడు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ప్రజలు బీజేపీవైపు నిలిచారు. ఎన్నికల ఫలితాల్లో డిపాజిట్లే రాని కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా రాష్ట్రంలో ప్రత్యామ్నాయమవుతోందో ఆలోచించాలి’ అన్నారు బండి సంజయ్. బీజేపీని దెబ్బతీయాలని కంకణం కట్టుకున్న కేసీఆర్ కాంగ్రెస్, ఎంఐఎం, ఒక సెక్షన్ మీడియాతో కలిసి కుట్ర చేస్తున్నడు. కర్నాటక ఎన్నికల ఫలితాలు రాంగనే తెలంగాణలో బీజేపీ పనైపోయిందని ప్రచారం చేస్తున్నయ్. మీడియాలోని ఓ సెక్షన్ వీరికి వంతపాడుతూ బీజేపీలో చేరిన లీడర్లంతా కాంగ్రెస్ లోకి పోతున్నరని కథనాలు మొదలు పెట్టినయ్.. కర్నాటక ఫలితాలకు, తెలంగాణకు సంబంధమేంది? అక్కడ ఓడిపోతే ఇక్కడెందుకు బీజేపీ బలహీనపడుతుందో రాజకీయ విశ్లేషకులు, జర్నలిస్టులు ఆలోచించాలి. శాసనసభ ఉప ఎన్నకలు, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను బేరీజు వేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.కేసీఆర్ ఎప్పటికప్పుడు సర్వేలు చేయించుకుంటున్నడు. ఆ పార్టీకి సొంతంగా అధికారం రాదని తేలిపోవడంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు పాకెట్ మనీ పేరుతో ఎన్నికల ఫండింగ్ చేస్తున్నడు. ఎందుకంటే కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే వాళ్లంతా బీఆర్ఎస్ తో కలిసి అధికారం పంచుకోవాలని చూస్తున్నరు. బీజేపీ సింగిల్ గా పోటీ చేస్తుంది. మెజారిటీ సాధిస్తుంది. అనుమానం లేదు. సినిమాల్లో గుర్తుండిపోయిన విలన్లు రావుగోపాలరావు, కైకాల సత్యనారాయణ, అల్లు రామలింగయ్య. రాష్ట్రంలో కేసీఆర్ మెయిన్ విలన్ అయితే కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు సత్యనారాయణ, అల్లు రామలింగయ్య , కైకాల సత్యనారాయణ మిగతా విలన్లు అన్నారు. కమ్యూనిస్టులను ఆకు రౌడీల టైపు అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వీళ్లంతా విలన్ల లాగ అడ్డుకుంటున్నా.. హీరోలెక్క ÷ట్ చేస్తూ ప్రజలను కాపాడుకునేందుకు పోరాడుతోంది బీజేపీ. ఎవరెన్ని కుట్రలు చేసినా బీజేపీని ఏమీ చేయలేరనే విషయాన్ని ప్రజలకు కూడా అర్థమైందన్నారు’ బండి సంజయ్. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలందరికీ అభినందనలు. కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లలో చేపట్టిన కార్యక్రమాలను గ్రామగ్రామాన, గడప గడపకూ చేర్చాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను నిర్వహిస్తున్నాం. ఈనెల 30 నుండి జూన్ 30 వరకు మహా జన సంపర్క్ అభియాన్ పేరుతో కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించాం. దేశంతోపాటు తెలంగాణ అభివృద్ధి కోసం నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నా కేసీఆర్ ప్రభుత్వ మూర్ఖత్వంతో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు. కేంద్రం చేపట్టిన కార్యక్రమాలను, ఇస్తున్న నిధులను ప్రజా సంగ్రామ యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లామని బండి సంజయ్ అన్నారు. అయితే నాకు బాధన్పించే విషయం ఒక్కటే... రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఎస్సీ,ఎస్టీ, బీసీలుసహా తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలు బాధల్లో ఉన్నరు. కేసీఆర్ పాలన విరగడ కావాలని కోరుకుంటున్నరు. వాళ్లంతా ఆశగా బీజేపీవైపు ఎదురు చూస్తున్నరు. బీజేపీ సింహంలా సింగిల్ గానే కొట్లాడుతుంది. అధికారంలోకి వస్తుంది. బీజేపీ ఆధ్వర్యలో పేదల రాజ్యాన్ని స్థాపించడం ఖాయం అన్నారు.

## వైద్యవిద్యతో పాటు ఆస్పత్రుల

# బలోపేతం..

**మొదటిపేజీ తరువాయి..**

మంత్రి హరీశ్ రావు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా 80 వేల ఉద్యోగాల భర్తీ పక్రియ చేపట్టామన్నారు. 1331 మంది ఆయుష్ కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించామని తెలిపారు. 2014 నుంచి ఆరోగ్యశాఖలో 22,263 మందిని నియమించామని చెప్పారు. మరో 2 నెలల్లో కొత్తగా 9,222 పోస్టులు భర్తీ చేయనున్నామని వెల్లడించారు. ప్రభుత్వ వైద్య సేవలో దేశంలో నే తెలంగాణ మూడో స్థానంలో ఉన్నదని తెలిపారు. తెలంగాణ డయాగ్నొస్టిక్స్‌లో ప్రస్తుతం 54 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జూన్ నుంచి 134 రకాల వైద్య పరీక్షలు నిర్వహించ నున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఒక్క ఏడాదిలోనే కొత్తగా 9 మెడికల్ కాలేజీలు తీసుకువచ్చామని, ఒక్కో కాలేజీకి సుమారు రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన ఐదు నెలల్లోనే వై ద్యారోగ్య శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసింది. 1,147 పోస్టుల భర్తీకి నిరుడు డిసెంబర్ 6న నోటిఫికేషన్ ఇచ్చింది. 34 విభాగాల్లో ఈ ఖాళీలను ప్రకటించింది. ఇందులో మల్టీ జోన్-1లో 574 పోస్టులు, మల్టీ జోన్-2లో 573 పోస్టు లున్నాయి. డిసెంబర్ 20 నుంచి జనవరి 12 వరకు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి ఫిబ్రవరి 2 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన జరిపారు. 20న రోస్టర్ జాబితాను ప్రకటించారు. మార్చి 28న ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించారు.

వచ్చిన వాటిని పరిశీలించి, 8న తుది జాబితాను విడుదల చేశారు. వీరిలో 1,061 మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థుల ప్రైవేట్ ప్రాక్టీస్‌పై నిషేధం విధించారు. కొత్తగా నియామకమైన వారంతా డీఎంఈ పరిధిలోనే పని చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ చొప్పున ఏర్పాటు చేస్తున్నది. ఆయా కాలేజీల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు వైద్యశాఖ ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీలు చేపట్టింది. దీంతో మెడికల్ కాలేజీలకు సిబ్బంది సమకూరారు. ఈ నియామకాలతో రాష్ట్రంలో వైద్యవిద్య మరింత బలోపేతం కానున్నది.

# కమీషన్ల కోసమే ప్రాజెక్టులు

**మొదటిపేజీ తరువాయి..**

కేసీఆర్‌కు కమీషన్ ఇస్తారని సీఎం కేసీఆర్ పై వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్ నాయకులు తప్ప ఏ ఒక్క వర్గం బాగుపడలేదని విమర్శించారు.



లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని షాద్ నగర్‌లో ధర్నా చేస్తున్న ప్రతిపక్షాలు, రైతు సంఘాలకు షర్మిల మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె.. కేసీఆర్ సీఎంగా ఉన్నంత కాలం రైతుకు శాపమని..పాలమూరు, లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాదన్నారు. సర్కార్ మారితేనే రైతులు బాగుపడ్తారని.. ఉద్యోగాలొస్తాయని చెప్పారు. ప్రజలంతా ఏకమై కేసీఆర్ కు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేసీఆర్ స్పందించి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇకపోతే కేసీఆర్ ది పరిపాలనా అనాలా? లేక దిక్కుమాలిన పాలనా అనాలా? అని ప్రశ్నించారు. కేసీఆర్ లాంటి వ్యక్తి పందిరేస్తే కుక్కతోక తాకి కూలిపోయిందంటా అని సెటైర్లు వేశారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు కడితే మూడు నెలలకే మునిగిపోయిందన్నారు. కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయాన్ని కేసీఆర్ లక్షకోట్లకు పెంచిండని ఆరోపించారు. కేసీఆర్ .. కమీషన్ల చంద్రశేఖర్ రావుగా పేరు మార్చుకోవాలని సూచించారు.రాష్ట్రంలో పథకాలకు పైసలుండవు కానీ ప్రాజెక్టులకు పైసలు ఎక్కడి నుంచి వస్తున్నాయని షర్మిల ప్రశ్నించారు. ప్రాజెక్టులకైతే కాంట్రాక్టర్ల దగ్గర నుంచి కేసీఆర్ కు కమీషన్ వస్తుందని.. పథకాల అమలుకైతే కమీషన్ రాదన్నారు. రాష్ట్రం అప్పుల పాలైతే బీఆర్ఎస్ అకౌంట్లోకి కోట్లకి కోట్లు ఎలా వచ్చాయన్నారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ అంటే బంధిపోట్ల రాష్ట్ర సమితి అని ఊరికే అనలేదని, నడి రోడ్డుపైన దళిత న్యాయవాది కారు అద్దాలను పగులకొట్టి దాడి చేయడం, చంపేస్తామంటూ బెదిరించడం బందిపోట్లకే సాధ్యమని వైఎస్ఆర్టీపీ అధినేత్రి షర్మిల ధ్వజమెత్తారు. దళిత బంధు అక్రమాలను ఎత్తిచూపిన అడ్వకేట్ యుగంధర్ పై బీఆర్ఎస్ గూండాల దాడిని వైఎస్ఆర్టీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బందిపోట్ల రాష్ట్ర సమితి అంటే తనపైన హుటాహుటిన కేసు నమోదు చేయించిన కేసీఆర్.. దళిత న్యాయవాదిపై దాడికి దిగిన బీఆర్ఎస్ బందిపోట్లకు మాత్రం గొడుగు పడుతున్నారన్నారు. కేసీఆర్ సొంత రాజ్యాంగంలో ప్రతిపక్షాలకు పోరాడే హక్కు.. మీడియాకు ప్రశ్నించే స్వచ్ఛ, న్యాయవాదులకు రక్షణ లేదన్నారు. అందుకే టీఆర్ఎస్ అంటే తాలిబన్ల రాష్ట్ర సమితి, బీఆర్ఎస్ అంటే బందిపోట్ల రాష్ట్ర సమితి అన్నామని ఆదివారం ఆమె ట్వీట్ చేశారు.

# జివో 111 రద్దు.. భూ మాఫియా కోసమే..

**మొదటిపేజీ తరువాయి..**

పాలిస్తున్నారని విమర్శించారు. పరిపాలనపై పట్టులేని వ్యక్తి నిర్ణయాల వల్ల హైదరాబాద్ ఆగం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక హైదరబాద్ విధ్వంసం మొదలైందన్నారు. కేటీఆర్ రియల్ ఎస్టేట్ మాఫియాను తయారు చేసుకున్నారని ఆరోపించారు.

111 జీవో రద్దు అణువిస్ఫోటనం లాంటిదన్నారు. హిరోషిమా నాగసాకి లాగా హైదరాబాద్‌ను తయారు చేస్తున్నారన్నారు. 111జీవో రద్దు వెనక దనదాహం, అవినీతి, దోపిడీ ఉన్నాయని మండిపడ్డారు. 111 జీవో పరిధిలోని 80 శాతం భూములు కేసీఆర్ బినామీల చేతుల్లో ఉన్నాయన్నారు. పైపుల కంపెనీ కోసం 111 జీవో రద్దు చేస్తున్నారన్నారు. 111 జీవో రద్దు వెనక లక్షల కోట్ల స్కాం ఉందని ఆరోపించారు. 111జీవో రద్దు ముమ్మాటికీ విధ్వంసమే అని.. సోమేష్ కుమార్, అరవింద్ కుమార్ ఈ విధ్వంసానికి కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అరవింద్ కుమార్, సోమేష్ కుమార్, కేసీఆర్, కేటీఆర్‌లను అమరవీరుల స్థూపం దగ్గర కట్టేసి రాళ్లతో కట్టి చంపాలన్నారు. హైదరాబాద్ చెరువులన్నీ మాయం అయ్యాయని.. నీళ్ళు ఉన్న దగ్గరికి వెళ్ళి ఇల్లు కడుతున్నారన్నారు. రాసుకొరా సాంబ అని కేసీఆర్ చెప్పగానే అరవింద్ వచ్చి రాసుకుంటారు అంటూ రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి ఇప్పటి వరకు భూ కేటాయింపులు జరగలేదని, తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కోసం భూమి కేటాయించామని గుర్తుచేశారు. 5100 గజాల కోసం పైసలు కట్టామని... కానీ భూ కేటాయింపు జరగలేదన్నారు. అందుకే ఇప్పటికీ కిరాయికి ఉంటున్నట్లు తెలిపారు. కేసీఆర్ తన పార్టీ ఆఫీసుకి 11 ఎకరాలు కేటాయించుకోడం దుర్మార్గమని మండిపడ్డారు. తమ కార్యాలయానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. బండోడు, గుండోడు తమను తొత్తులని తిడుతారని టీపీసీసీ చీఫ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**కోరుట్ల టౌన్ మే 22 (ప్రజామంటలు):** కోరుట్ల మండలంలోని వెంకటాపూర్ స్టేజి వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే మేడిపల్లి మండలం మన్నే గూడెం గ్రామానికి చెందిన పంచతి హన్మాండ్లు (55), కొత్తపెల్లి రాజంలు ద్విచక్ర వాహనంపై గుమ్లాపూర్ రోడ్డు నుండి కోరుట్ల వైపు వస్తుండగా జగిత్యాల నుండి కోరుట్ల వైపు వస్తున్న ప్రైవేట్ బస్సు ఢీ కొనడంతో హన్మాండ్లు అక్కడికక్కడే మృతి చెందగా రాజం కు తీవ్ర గాయాలు అయ్యాయి. అటుగా వెళుతున్న కోరుట్ల ఎంవీఐ రంజిత్ కుమార్ క్షతగాత్రున్ని మానవత్వంతో అంబులెన్సులో చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రుల మృతి

## అనాథలైన పిల్లలను ఆదుకుంటాం

**కోరుట్ల టౌన్ మే 22 (ప్రజామంటలు):** ఇటీవల కోరుట్ల పట్టణంలోని బస్ స్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు ఇద్దరిని కోల్పోయి అనాథలైన తిమ్మాయిపల్లి గ్రామం కోరుట్ల మండలానికి చెందిన



ముగ్గురు చిన్నారులను జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి హరీష్ మరియు సిడిపిఓ తిరుమల దేవి సందర్శించి నిత్యవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి మాట్లాడుతూ.... పిల్లలు అధైర్య పడాల్సిన అవసరం లేదని పిల్లలకి ప్రభుత్వమే తల్లి తండ్రి పాత్ర పోషించి వారికి కావలసినటువంటి సకల సౌకర్యాలను అందిస్తుందని అంతేకాకుండా వారికి నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల వసతులను అందిస్తామని పేర్కొన్నారు అంతేకాకుండా ఒకవేళ పిల్లలని నానమ్మ లేదా అమ్మమ్మ లేదా ఇతరులు ఎవరైనా చూసుకుంటే వారికి మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ తరఫున స్పాన్సర్షిప్ ద్వారా ఆర్థిక సహాయం ఇస్తామని ఒకవేళ చూసుకొని ఎడల శాఖ ఆధ్వర్యంలో ఉండే బాలల సంరక్షణ గృహాలలో తరలించి వారికి 18 సంవత్సరాల వచ్చేంతవరకు విద్యా ఆహారంతో పాటు అన్ని రకాల పరిస్థితులను కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు సూపర్వైజర్ షైనీ సురేష్, శ్రావణ్ అంగన్వాడి టీచర్ మొదలగున వారు పాల్గొన్నారు.



శ్రీశ్రీ కళా వేదిక కర్నూలు శాఖ ఆధ్వర్యంలో జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో ఘన సత్కారం అందుకున్న జనగామ జిల్లా ప్రముఖ ఇంద్ర జాలకులు మ్యాజిక్ ఆనంద్.

## కవి, కళాకారుడు మాన్యపు భుజేందర్‌కు

# జాతీయ పురస్కారం

**పాలకుర్తి మే 22 (ప్రజామంటలు):** జనగామ జిల్లా బమ్మెర గ్రామ వాసి కవి, కళాకారుడు మాన్యపు భుజేందర్ శ్రీశ్రీ అంతర్జాతీయ కళావేదిక



ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో 119వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని కవితగానం చేసి సన్మానం అందుకున్నారు. అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ ఉపాధ్యక్షురాలు కట్ల భాగ్యలక్ష్మి, కర్నూలు జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, జాతీయ సహాయ కార్యదర్శి చెట్టే లలిత, జాతీయ సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా జాతీయ పురస్కారాన్ని కర్నూలు నగరంలో భుజేందర్ అందుకున్నారు. జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొన్నందుకు భుజేందర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పలువురు భుజేందర్ ను అభినందించారు.



జగిత్యాల ఆర్టీసి డిపో సమీపంలో సోమవారం తెల్లవారు జామున 4:00 గంటల ప్రాంతంలో జగిత్యాల-కరీంనగర్ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదం ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ కొని షేక్ అహ్మద్ హుస్సేన్ (46) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి.

## ఘనంగా దళితుల జీవితాల్లో వెలుగును నింపిన

# భాస్కరుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

**జగిత్యాల మే 22 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాను చిన్నప్పటి



నుండి భాగ్యరెడ్డి వర్మ ఎంతో జ్ఞానవంతుడు ఉద్యమ స్ఫూర్తి ఉన్నటువంటి పిల్లలకు ఆడపిల్లలకు చదువు ఉండాలని ఉద్దేశంతోటి దాదాపు ఒక 26 పాఠశాలలను ఏర్పాటు చేసి మహిళలకు విద్యను అభ్యసించే విధంగా అయిన కృషి చేశారని వారు అలాగే మరి అంబేద్కర్ కు రౌండ్ టేబుల్ సమావేశంలో కూడా వారికి అండదండలుగా ఉండి భారతదేశం నుండి ఆయనే నాయకునిగా రౌండ్ టేబుల్ లో అంబేద్కర్ యొక్క వాదాన్ని బలపరిచిన వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని అలాగే తెలంగాణలో మాన్యం సంఘాన్ని ఏర్పాటు చేసి అసలు సంఘాలను ఏర్పాటు చేసినా నిర్మాత మన భాగ్యరెడ్డి వర్మ మరియు అతని యొక్క జన్మదిన సందర్భంగా జగిత్యాల జిల్లా వ్యాప్తంగా అందరూ అయన జయంతి ఘనంగా జరుపుకోవడం సంతోషంగా భావిస్తున్నాం అన్నారు.

ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు మద్దెల నారాయణ జగిత్యాల ఇంచార్జ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాయితి శంకర్ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మ్యాదరి శ్రీహరి, ఉపాధ్యాయులు జూపాక సుదర్శన్, అడ్వకేట్ నకుమల్ల లక్ష్మీనారాయణ, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ జిల్లా ఉపాధ్యక్షులు కాయితి శ్రీనివాస్, మాల మహానాడు జగిత్యాల మహిళ ప్రధాన కార్యదర్శి పంగ పుష్పలత, రెవెన్యూ శాఖ బీర్పూర్ రాజలింగం, సర్పంచ్ నల్ల శ్యామ్, మాల మహానాడు భీమారం మండల అధ్యక్షులు బక్కురి నరేష్, అనిల్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ల సంక్షేమానికి

# 200 కోట్ల నిధులు కేటాయించాలి

### హెల్త్ కార్డులిచ్చి కార్పొరేట్ వైద్యం అందించాలి

### వినోద్ కుమార్‌కు మాజీ సర్పంచుల వినతి



**జగిత్యాల మే 22 (ప్రజామంటలు):** ఐదు సంవత్సరాల సర్పంచ్ పదవి కాలంలో గ్రామాలాభివృద్ధికి, ప్రజలకూ మౌళిక వసతుల కల్పన, ప్రజా సంక్షేమానికి పాటుపడి ఆర్థికంగా క్షీణించిన మాజీ సర్పంచ్ లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినిపెల్లి వినోద్ కుమార్ ను మాజీ సర్పంచ్ ల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బొడ్డు దేవయ్య కోరారు.

ఈమేరకు సోమవారం కరీంనగర్ లో వినోద్ కుమార్ కు సమస్యలు పరిష్కరించేలా చూడాలని మాజీ సర్పంచ్‌లు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్బంగా బొడ్డు దేవయ్య, కరీంనగర్, జగిత్యాల, పెద్దపెల్లి జిల్లాల అధ్యక్షులు పుప్పాల రఘు, మచ్చ నారాయణ,వేల్పుల మల్లికార్జున రావు, జగిత్యాల జిల్లా అధికార ప్రతినిధి ఎన్నం కిషన్ రెడ్డి లు మాట్లాడుతూ.... ప్రజా సమస్యలు, గ్రామభివృద్దే ధ్యేయంగా పనిచేసి అప్పుల పాలై మానసికంగా క్రుంగిపోయిన ప్రభుత్వాలు మమ్ములను పట్టించుకోవడంలేదని వాపోయారు. రాష్ట్ర రాజధానితో పాటు జిల్లా కేంద్రాల్లో కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని కోరారు. రాష్ట్రంలోని మాజీ సర్పంచులందరికి 5 వేల గౌరవ పెన్షన్ అందించాలని దేవయ్య, రఘు, నారాయణ, కిషన్ రెడ్డిలు కోరారు. వీరితో పాటు మాజీ సర్పంచ్ ల సంక్షేమ సంఘం ప్రతినిధులు చంద శంకర్, చందుపట్ల పరంధాములు, గోపగాని సమ్మయ్య, మ్యాకల కార్తీక్ యాదవ్, బొల్లె గంగారాం, బొక్కల విరారెడ్డి, కందునూరి ప్రమోద్ రావు, ఆది మధుసూదన్ రావు తదితరులున్నారు.

## కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయుల,

# ఉద్యోగుల సర్వీసులు రెగ్యులర్ చేయాలి

### ఏకశిల పార్కు వద్ద ధర్నా

### ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మద్దతు

**హనుమకొండ మే 22 (ప్రజామంటలు):** హనుమకొండ, వరంగల్ జిల్లా టి ఎస్ యూటిఎఫ్ శాఖల ఆధ్వర్యంలో కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయుల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏకశిల పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కు మద్దతుగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ అన్ని కేజీ బీజీ లో రెగ్యులర్ పోస్టులు మంజూరు చేసి పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉద్యోగులను పార్ట్ టైం సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఓ ను ప్రిన్సిపాల్ గా, పిజిసిఆర్టి లను జూనియర్ లెక్చరర్స్ గా, సిఆర్టి లను స్కూల్ అసిస్టెంట్స్ గా, పిఈటి లను పీడీలుగా.. గుర్తించి ఆ పోస్ట్ యొక్క బేసిక్ పేను మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హాస్టల్ నిర్వాహణ కోసం కేర్ టేకర్ ను నియమించాలని, నైట్ డ్యూటీల నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్ట్ టైమ్, కంప్యూటర్, వృత్తి భోదకులను పూర్తి కాలం సిఆర్ టి లు గా మార్చాలని డిమాండ్ చేశారు. టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ మాట్లాడుతూ.... హెల్త్ కార్డులు ఇచ్చి నగదు రహిత వైద్యం అందించాలని, మోడల్ స్కూల్ హాస్టల్ నిర్వాహణ అదనపు బాధ్యతల



నుండి ఎస్ఓలను తప్పించాలని డిమాండ్ చేశారు. వంట మనుషులు, స్వీపర్లుగా పనిచేస్తున్న వారికి కూడా అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని నూతన పిఆర్సి ప్రకారం వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామని జూన్ 08 న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు.

టీఎస్ యుటిఎఫ్ వరంగల్ హనుమకొండ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం. సదాశివరెడ్డి, తాటికాయల కుమార్, బద్దం వెంకటరెడ్డి ఉపాధ్యక్షులు ఎం అన్నాదేవి, దామోదర్, సమ్మక్క, బి ఎల్లయ్య , రవీందర్ రాజు, డి. కిరణ్ కుమార్, కేజిబివి కన్వీనర్ లు టీ. రేణుక, పి. అనితాదేవి, ఈ. విజయ, పి. సరిత , పి. విజయ, శ్రీలత, సులోచన రెండు జిల్లాల నుండి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో పర్స సత్యనారాయణ 8వ వర్ధంతి

**జనగామ మే 22 (ప్రజామంటలు):** కార్మికోద్యమ వేగుచుక్క పర్స సత్యనారాయణ అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు కొనియాడారు. సోమవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో పర్సా సత్యనారాయణ 8వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా హక్కుల కోసం సమస్యల పరిష్కారం కోసం అనేక కార్మిక ఉద్యమాలను నిర్మించిన మహనీయుడు పర్స సత్యనారాయణ అని అన్నారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొని నిజాం నిరంకుశ పాలన వ్యతిరేకంగా భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా




చిత్రపటానికి పూలమాలలు వేసి సిఐటియు నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జోగు ప్రకాష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు మాట్లాడుతూ.... తాను మరణించేంతవరకు తన జీవితకాలమంతా కార్మిక తిరుగుబాటు చేసిన యోధుడు నేటి తరానికి ఎంతో ఆదర్శంమైనా కార్మిక నేత అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు తాండ్ర ఆనందం, నాయకులు కళ్యాణం లింగం మల్లేష్ రాజ్, బుచ్చిరెడ్డి, యాకం రెడ్డి, నరసింహులు, కుమార్, చెన్నయ్య, బీ. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.




సీఎం కప్ 2023 జిల్లా స్థాయి పోటీలలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన రాహుల్ లాంగ్ జంప్ లో ప్రథమ స్థానం పొందాడు. అభినందించిన గ్రామస్తులు, స్నేహితులు

# రైతుల కష్టాన్ని దోచుకుంటున్న మిల్లర్లు

### ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మల్లికార్జున్ రెడ్డి

**హుస్నాబాద్ మే 22 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామములోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని



సందర్శించిన వైఎస్సార్ తెలంగాణ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ....తరుగు పేరుతో కోతలు పెట్టి రైతులను నిలువు దోపిడీ చేస్తున్న మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జనగామ జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, డిసిపి సీతారాం, మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున.

# ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

### నకిలీ విత్తనాలు, కల్తీ మందులు అమ్మితే పిడి యాక్ట్ నమోదు

**గొల్లపల్లి మే 22 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలంలోని వివిధ ఫర్టిలైజర్ షాపులను సోమవారం మండల వ్యవసాయ అధికారిణి కరుణ




తో కలసి తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు, కల్తీ మందులు ఎక్స్‌ఫైర్ డేట్ అయిపోయిన విత్తనాలు, మందులు రైతులకు అమ్మి రైతులను మోసం చేస్తే ఫర్టిలైజర్ షాపుల యజమానులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా పిడి యాక్ట్ నమోదు చేస్తామని ఫర్టిలైజర్ యజమానులను కరుణ, ఎస్సై దత్తాద్రి హెచ్చరించారు. మండలంలో ఎవరైనా నకిలీ విత్తనాలు గాని, కల్తీ మందులు గాని అమ్మినచో ఎస్సై దత్తాద్రి కి తెలియజేయాలని అన్నారు.



చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన ఉమ్మగోని ఐలయ్య రెండు ఎకరాల గడ్డివామును తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో జాప్యం

### రైతుల ధర్నా

**రాయికల్ మే 22 (ప్రజామంటలు):** జగిత్యాల రాయికల్ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో జాప్యాన్ని నిరసిస్తూ రైతుల ధర్నా చేశారు.



మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న మక్కలకు హమ్మాలి చార్జీలు, ఏ గ్రేడ్ కింద కొనుగోలు చేయాల్సింది బి గ్రేడ్ గా పరిగణించి కొనుగోలు చేస్తు రైతులను దోచుకుంటున్నారని, రైతులు అన్నారు. రేపటినుండి యధావిధిగా కొనుగోలు చేస్తామని మార్కెట్ కమిటీ అధికారులు చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

# పథకాలతో ఎంతకాలమీ టోకరా!

దేశంలోను,రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ అవసరం. కులరహిత సమాజాం కోసం పాటుపడాల్సిన పాలకులు, రాజకీయ నేతలు కులాల కుంపట్లను ఇంకా ప్రోత్సహిస్తున్నారు. రాజకీయాలు మొత్తం కులాల చుట్టే తిరుగుతున్నాయి. ఇందుకోసం కులాల వారీగా పథకాలు ప్రకటిస్తున్నాయి. అయితే నగదు బదిలీలు, లేదా ఇతర తాయిలాలు ప్రకటించడం దారుణం కాక మరోటి కాదు. రాజకీయ పార్టీలన్నీ బిసిల ఎజెండా అంటూ వల్లె వేస్తున్నాయి. ఏ కులం అయినా మరం మరచిపోయాఅ అని దివిటీ పెట్టి వెతుకుతున్నాయి. రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు.. ఈ రెంటిని అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. రాజకీయాల్లో ఏ పార్టీ అయినా హుందాగా ఉండాలి. రాజకీయాల్లో వ్యక్తిగత విద్వేషాలకు తావు ఉండరాదు. గుదిబండగా మారిన పథకాలను ఎప్పటికైనా సమీక్షించి అందుకు తగు నిర్ణయం తీసుకోవాలి. నితరంతరాయంగా డబ్బుల పందేరం లేదా పథకాలో డబ్బులు పంచడంతో ఓట్లు పొందాలన్న ఎత్తుగగడలను ఇక ఎంతమాత్రం కొనసాగించరాదు. ఈ డబ్బుల పందేరాన్ని అభివృద్ధిగా చూపి ప్రచారం చేసుకోవడం కూడా సరికాదు. జగన్ కూడా అదే ధోరణితో ఉన్నారు. అదే పనిగా పందేరం పథకాలకు పెద్దపీట వేస్తున్నారు. డబ్బులుపంచడమే అభివృద్ధి అన్న నినాదం ఎత్తుకు న్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. ఈ విషయంలో ఇకనైనా జగన్ తీరు మారాలి. మౌళిక సదుపాయాలు కల్పించడం, సౌకర్యాలు కల్పించడం, ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచడం ముఖ్యం కావాలి. అభివృద్ధి నమూనా మారకుంటే రాష్ట్రం దోగతి పాలుకకాక తప్పదు. ఈ విషయాలను గుర్తించి ప్రాంతీయ పార్టీలు పాలన సాగించాలి. అలాగే ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల మనసెరిగి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. అప్పుల భారం పెరుగుతున్న క్రమంలో ఉచితపథకాలను తగ్గించుకోవడం ద్వారా ప్రజలపై భారం పడకుండా చూడాలి. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే రూపాయికి కిలో బియ్యం పథకాన్ని సమీక్షించుకోవడం.. లేదా బియ్యం ధరలను పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే జనాభాను మించి తెల్లకార్డులు ఉన్నాయి. వీటిని సమీక్షించాలి. బియ్యం ధరలు కనీసం పదిగా నిర్ణయించాలి. ఇది ఎపికి కూడా వర్తిస్తుంది. కుటుంబ సర్వే ప్రకారం అర్హుల జాబితాను గుర్తించాలి. అలాగే రైతుబంధు జాబితాను కూడా మళ్లీ సమీక్షించాలి. బడాభూములున్న వారికి, తోటలు, బంజరు భూములున్న వారికి రైతుబంధు సాయం అందకుండా చూడాలి. పథకాలతో ప్రజలను మచ్చిక చేసుకోవచ్చేమో కానీ అదే



అభివృద్ధి అని నమ్మించడం సరికాదు. తాగు,సాగునీటితో పాటు, విద్యుత్, రోడ్డు వసతులను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలి. విద్యావైద్య రంగాలకు కేటాయింపులు పెంచి వసతులను మెరుగు పరచాలి. నిరుద్యోగ సమస్య మొత్తంగా పరిష్కరించకున్నా ఉపాధి అవకాశాలను పెంచాలి. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. తెలంగాణలో కాంగ్రెస్, బిజెపిలను అణగదొక్కడంలో కెసిఆర్ ఎలాంటి వెనకడుగు వేయలేదని రాష్ట్ర రాజకీయాలను చూస్తే అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్, టిడిపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఫలించాయి. ఆయన దెబ్బకు టిడిపి ఉనికిలేకుండా పోయింది. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించు కోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. బిజెపి అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరాశా నిస్పృహ లతో ఉన్న మమతా బెనర్జీ బిజెపి నేతలపై దాడులకు దిగుతోంది. గత ఎన్నికల్లో గెలిచినా బిజెపి కూడా బలంగానే ఉందని ఉనికిని చాటింది. తెలంగాణల కూడా తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీసిన కేసీఆర్, ఇప్పుడు బీజేపీ రూపంలో ప్రతిపక్షాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఊహించి ఉండకపోవచ్చు. పశ్చిమబెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఏ తప్పు చేశారో తెలంగాణలో కూడా కేసీఆర్ అదే తప్పు చేస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లో బలంగా ఉన్న వామపక్షాలను మమతా బెనర్జీ బలహీనపరిచారు. ఫలితంగా ఆ రాష్ట్రంలో ఇప్పుడు భారతీయ జనతాపార్టీ ప్రత్యామ్నా య శక్తిగా ఎదిగింది. తెలంగాణలో కూడా ఇదే జరుగుతోంది. అసెంబ్లీలో ఒక్క సీటు కాస్తా మూడుకు పెరిగింది. బీజేపీ ఇంతలా బలం పుంజుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల తరఫున ఎవరైనా ఏ ఎన్నికల్లోనైనా గెలిస్తే వారిని తమ పార్టీలోకి కలిపేసుకుంటూ వచ్చిన కేసీఆర్ బీజేపీకి చెందిన వారిని మాత్రం ఆకర్షించలేక పోయారు. అలాగే వారికి పునాదే లేదన్న ధోరణి ప్రదర్శించారు. కానీ ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించలేదు. కమలనాథుల బలం అనూహ్యంగా పెరగడానికి ఇదే ప్రధాన కారణం. తెలంగాణ బిజెపిలో ఇప్పుడు నాయకత్వం కూడా బలంగా ఉంది. ముఖ్యంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ దూకుడు పెంచి టీఆర్‌ఎస్‌ను తమ ఉచ్చులోకి లాగారు. ప్రజల్లో గూడు కట్టుకుంటున్న అసంతృప్తిని పసిగట్టడంలో టీఆర్‌ఎస్ నాయకత్వం విఫలమైంది. అధికారం అంతా ఒక కుటుంబం వద్దనే కేంద్రీకృతమై ఉందన్న ఆరోపణలు పెరిగాయి. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా మీడియాను దూరం పెట్టారు. కేసీఆర్ చిన్నపాటి విమర్శను కూడా స్వీకరించలేని స్థితికి చేరుకున్నారు.(కర్నాటకలో తాజాగగా బిజెకి పట్టిన గతే ఏ రాష్ట్రంలో అయినా.ఏ పార్టీకైనా పట్టడం ఖాయం.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్

## సొంత సంపాదన

పచ్చని గొడుగు విచ్చుకున్నట్టు విశాలంగా వున్న చింత చెట్టుపైన రకరకాల పక్షులు,ఉడుతలు గూళ్ళుకట్టుకొని వాటి సంతానాన్ని పెంచుకోసాగాయి.

పక్షులు పంటపొలాల నుండి ధాన్యపుగింజల్ని తెచ్చి పిల్లలకు తినిపించేవి. ఉడుతలు ఆహారాన్ని వెతుక్కుంటూ రకరకాల పండ్లను,గింజల్ని తిని చీకటిపడే వేళకు గూటికి చేరుకునేవి. ఒకరోజు ఉడుతలకు మేతదొరక్క చాలాదూరం వెళ్ళవలసివచ్చింది.తల్లితోపాటు మేతకు వెళ్ళిన ఉడుత పిల్ల అలసిపోయింది.సాయంత్రం వేళకు నెమ్మదిగా ఎగురుకుంటూ



తల్లితోపాటు గూటికి చేరింది.

తెల్లవారగానే ఉడుతలన్నీ మేతకు బయలుదేరాయి.ఉడుతపిల్ల నీరసంగా వుండటం చూచి తల్లి బాధపడింది."ఈ రోజుకి విశ్రాంతి తీసుకో బిడ్డా!.నీకోసం ఎంతదూరమైనా వెళ్ళి .నీకు ఇష్టమైన గింజలు తెచ్చిపెడతాను.కడుపునిండా తిందువుగాని."అంటూ బుజ్జగించి మేతకు బయలుదేరింది.

ఉడుతపిల్ల గూటిలో ముడుచుకొని నిద్రపోయింది.కొంతసేపటికి నిశ్శబ్దంగావున్న ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా కోలాహలంగా మారింది. ఒంటరిగా ఉన్న ఉడుతపిల్ల ఉలికిపడి నిద్రలేచింది.భయంతో బయటకు తొంగిచూచింది.గుంపులు గుంపులుగా వస్తున్న పక్షుల్ని చూచి గూళ్ళలోని పక్షిపిల్లలు నోళ్ళు తెరచి అరుస్తున్నాయి.పంటపొలాలనుండి తెచ్చిన గింజల్ని తల్లిపక్షులు పిల్లలనోట్లో వేసి తినిపిస్తున్నాయి.

ఆ సమయంలో కొన్నిగింజలు పిల్లల నోటినుండి జారి కిందపడుతున్నాయి. ఈ సంగతి గమనిస్తున్న ఉడుతపిల్లకు ఒక ఉపాయం తట్టింది.కష్టపడకుండా కడుపునింపుకునే అవకాశం దొరికిందని సంబరపడింది.రెప్పపాటులో గూటినుండి బయటకువచ్చి చెట్టుకిందకు చేరింది.తలపైకెత్తి చూస్తే ధాన్యపుగింజల వర్షం కురుస్తున్నట్లనిపించింది.

దొరికిన గింజను దొరికినట్టు నోట్లోవేసుకొని ఆకలి తీర్చుకుంది.ఈ విషయాన్ని తన తల్లికి కూడా చెప్పకుండా రహస్యంగా వుంచాలని నిర్ణయించుకుంది.తల్లి వచ్చే వేళకు గూటిలోకి చేరిబాధ నటిస్తూ మూలగసాగింది.గూటికి చేరిన తల్లి ఉడుత బిడ్డబాధను చూచి తల్లడిల్లిపోయింది. "ఇదిగో బిడ్డా ..నీకోసం రుచికరమైన గింజలు తెచ్చాను తిను "అంటూ ఆప్యాయంగా తినిపించింది.తల్లితెచ్చిన గింజల్నితిని ఉడుతపిల్ల హాయిగా నిద్రపోయింది.

ప్రతిరోజూ ఏదో ఒక రోగంపేరుచెప్పి మేతకువెళ్ళడం మానేసింది ఉడుతపిల్ల.చెట్టుకింద రాలిపడిన గింజల్నే కాక తల్లితెచ్చిన గింజల్ని కూడా తింటూ కాలం గడపసాగింది.

నెలలు గడిచి పోతున్నా బిడ్డ మేతకు రాకపోవడంతో తల్లికి ఆహారసంపాదన కష్టంగా మారింది.

రోజుకో రోగం పేరుచెప్పి తప్పించుకుంటున్న ఉడుతపిల్ల మాటలపై సందేహం కలిగింది.ఉడుతపిల్లను దూరం నుండి గమనించడం మొదలు పెట్టింది.

ఒకరోజు రాలిన గింజల్ని తింటుండగా అక్కడికి ఒక కుందేలు గెంతుకుంటూ వచ్చింది.అంత పెద్ద శరీరాన్ని చూచి ఉడుతపిల్ల భయపడింది."ఎవరు మీరు "అంటూ వణికిపోతూ అడిగింది."ముందు నా ప్రశ్నకు జవాబు చెప్పుఉడుతలన్నీ మేతకు వెళితే ,ఒంటరిగా ఇక్కడేం చేస్తున్నావ్."అంటూ బెదిరించింది కుందేలు."..."ఆరోగ్యం బాగాలేక మేతకు వెళ్ళలేకపోయాను. ఇదిగో ఈ చెట్టుకింద రాలిన గింజల్నితిని ఆకలి తీర్చుకుంటున్నాను."అంటూ దీనంగా బదులిచ్చింది ఉడుతపిల్ల."ఛీ..ఛీ..సోమరిపోతా!అబద్ధం చెప్పకు కష్టపడకుండా వచ్చిన ఎంగిలి గింజలు తిని ఒళ్ళు పెంచుకుంటున్నావ్. తోటివాళ్ళు కష్టపడి ఆహారం సంపాదించుకుంటుంటే రోగం పేరుతో ఒళ్ళుదాచుకుంటావా?.. పని చేయగలిగే శక్తి వుండి,ఇతరులపై ఆధారపడటం మన జంతు జాతికే అవమానం"అంటూ కోపంతో ఊగిపోయింది కుందేలు."..మీరు పెద్దవారు నిజం తెలుసుకోకుండా నిందలు వేయడం మీకు తగునా?"అంటూ ఏడవసాగింది ఉడుతపిల్ల."పెద్దదాన్ని గనుకనే బుద్ధి చెప్పడానికి వచ్చాను.చేసిందంతా చేసి మొసలి కన్నీరు కారుస్తావెందుకు?అసలు విషయం చెబుతా విను"అంటూ ఉడుత పిల్లను దగ్గరకు తీసుకుంది కుందేలు."మీ అమ్మ నాకు మంచి స్నేహితురాలు.దారిలో కలిసి నీ గురించి చెప్పింది.

ఒకరోజు మేతకు వెళ్ళివస్తూ గింజలు మేసి లేని రోగాన్ని నటిస్తున్న నీ మోసాన్ని గ్రహించి బాధ పడిందట. బిడ్డను పోషించడం కష్టం కాక పోయినా తల్లికి భారంగా మారి, బాధ్యతల్ని మరిచిపోకూడదుకదా!. నేరుగా నిన్నే అడగాలనుకున్నా, నిన్ను చిన్నబుచ్చటం ఇష్టంలేక అడగలేక పోయిందట. అదీ తల్లి మనసంటే ఇప్పటికైనా అర్థమైందా?"అంటూ వివరించింది.

ఆ మాటలు విన్న ఉడుతపిల్ల సిగ్గుతో తలదించుకుంది.తనవల్ల తల్లికి కలిగిన కష్టాన్ని తలచుకొని బాధ పడింది.

"ఇప్పుడు బాధపడి ఏం లాభం?ఈ సంవత్సరం వర్షాలు లేక పంటలు ఎండిపోయాయి.ఈ చింత చెట్టుకూడా ఎండిపోవడం మొదలైంది.పక్షులన్నీ గూళ్ళను వదిలి వలస పోవడం ప్రారంభించాయి.నేడో రేపో ఈ గింజలు కూడా కరువై పోతాయి.నీకు ఆహారం కోసం వెతుకులాట తప్పదు.ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ,ఆహారం సంపాదించడం అలవాటు చేసుకో"అంటూ అసలు విషయం చెప్పి ముందుకు నడిచింది కుందేలు.

తప్పు తెలుసుకున్న ఉడుతపిల్ల,తల్లి గూటికి రాగానే క్షమాపణ వేడుకుంది.అప్పటినుండి తల్లితో పాటు మేతకు వెళ్ళడం మొదలు పెట్టింది.ఇతరులపై ఆధారపడటం మానేసి,సొంతంగా ఆహారాన్ని సంపాదించటం అలవాటు చేసుకుంది.కష్టపడి పనిచేయటంలో వున్న ఆనందాన్ని తిరిగి పొందగలిగింది.

– డా.పోతగాని సత్యనారాయణ,
ఖమ్మం, 9441083763

# నటుడు, మిమిక్రీ కళాకారుడు హరికిషన్

## మే 23...వంగిపురం హరికిషన్ వర్ధంతి

వంగిపురం హరికిషన్ (మే 30, 1963 ? మే 23, 2020) ఆంధ్రప్రదేశ్ కు చెందిన మిమిక్రీ కళాకారుడు. ఒక గంటలో 100 మంది గొంతులను అనుకరించి 'శత కంఠ ధ్వన్యనుకరణ ధురీణ' బిరుదును పొందాడు.

1963, మే 30 తేదీన శ్రీమతి రంగమణి, వి.ఎల్.ఎన్. చార్యులు దంపతులకు ఏలూరులో జన్మించాడు.

8 సంవత్సరాల వయసులోనే తమ గురువుల కంఠాలను, బంధువుల కంఠాలను అనుకరించడం ప్రారంభించి క్రమంగా సమాజంలోని ప్రముఖుల, క్రికెట్ తదితర క్రీడాకా రుల, రాజకీయ



నాయకుల, సినీ తారల, కవుల, గాయకుల గొంతును అనుకరించడం నేర్చుకున్నాడు. అంతేకాక పశుపక్ష్యాదుల శబ్దాలు, యంత్రాలు చేసే శబ్దాలు, సంగీత వాద్య పరికరాల శబ్దాలను పలికించడం నేర్చు కున్నాడు .ఆయనకు భాషపై పట్టు, వాక్పటిమ, సమయస్ఫూర్తి ఆయనను మిమిక్రి రంగంలో ఉన్నత శిఖరాలకు చేర్చింది.

తెలుగు చిత్రసీమలోలో అలనాటి సీనియర్ నటులైన నందమూరి, అక్కినేని, ఎస్వీఆర్, గుమ్మడి, కృష్ణ, శోభన్ బాబు, చిరంజీవి ..ప్రస్తుత యూత్ హీరోలైన జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు, ప్రభాస్ వరకు అందరినీ అలవోకకా అనుకరించ గల మిమిక్రీ కళాకారుడు హరి కిషన్. కేవలం తెలుగు సినిమా పరిశ్రమలోని ఆర్టిస్టులనే కాకుండా హాలీవుడ్, బాలీవుడ్ సినిమా నటులను అద్భుతంగా అనుకరించేవాడు. సినీ హీరోలు, నటులే కాక, ప్రధానులు, రాష్ట్రాల్లో మాజీ, ప్రస్తుత ముఖ్య మంత్రులు.. ఎన్టీఆర్, వైయస్ఆర్, చంద్రబాబు, రోశయ్య, కేసిఆర్ ఇలా ఎందరి గొంతులనో అనుకరించే వాడు. డైలాగ్‌లు అనుకరించడమే కాదు, కొన్ని చిన్న స్కిట్‌లను వారు చేస్తే ఎలా ఉంటుందో చేసి చూపించే వాడు, తద్వారా ప్రేక్షకులని కడుపుబ్బా నవ్వించే వాడు. ఒకేసారి రెండు వాయిస్‌లను అనుకరించడం, దూరం నుంచి దగ్గరి నుంచి వచ్చే శబ్దాలు ఎలా ఉంటాయో ప్రదర్శించడం లాంటి ఎన్నో ప్రయోగాలు చేశాడు. హాలీవుడ్ చిత్రాలు 'జురాసిక్ పార్క్, అనకొండ, ఈవీల్‌డెడ్, మెకన్నాస్ గోల్డ్, మమ్మీ, మమ్మీ రిటర్న్స్ ఇలా పలు చిత్రాలను ఆయన తన గొంతుతో రీక్రియేట్ చేశాడు.

పలు ఛానెల్స్‌లో షోలు నిర్వహిం చిన ఘనతను ఆయన సొంతం చేసుకొన్నాడు. బుల్లితెరపై ఆయన షోలకు విశేషంగా ఆదరణ ఉండేది. అంతేకాకుండా తెలుగు సినీ పరిశ్రమలో ఎలాంటి నటుడినైనా అనుకరించే టాలెంట్ ఉన్న కళాకారుడిగా హరికిషన్‌కు పేరుంది. పశు పక్ష్యాదుల శబ్దాలతో పాటు సంగీత వాద్య పరికరాలు, యంత్రాలు చేసే శబ్దాలు.. తన గొంతులో పలకించ డం హరి కిషన్ ప్రత్యేకత. మిమిక్రీతో వెండితెరకు పరిచయ మైన చాలామంది నటులు ఆయన శిష్యులే.

తన మొట్ట మొదటి మిమిక్రీ ప్రదర్శన 1971 మే 12న విజయవాడలో తాను చదువుతున్న పాఠశాలలోనే జరిగింది. దేశ విదేశాల్లో 10 వేలకు పైగా మిమిక్రీ ప్రదర్శనలు ఇచ్చాడు. టీవీ కార్యక్రమాల్లో , సీరియల్స్, సినిమాల్లో నటించాడు.

హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్ హైస్కూల్‌లో 12 ఏళ్ళపాటు గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా, తరువాత పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం లో మిమిక్రి లెక్చరర్‌గా పనిచేశాడు.

హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2020, మే 23న మరణించాడు.



–ఆర్కె సంగనభట్ల
9440595494

# రూపాయి బలోపేతంపై దృష్టి ఏదీ..!


దేశ ఆర్థికవ్యవస్థ కరిమింగిన వెలగపండులాగా మారింది. పైకి మైనం పూసిన ఆపిల్ పండులా నిగనిగా కనిపిస్తున్నా.. అంతా డొల్లేనని తెలుస్తూనే ఉంది. రోజురోజుకు రూపాయి విలువ పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మన ఆర్థిక వ్యవస్థ బలంగా లేదనడానికి ఇంతకన్నానిదర్శనం అక్కర్లేదు. గత కొన్నిమాసాలుగా రూపాయి పతనం వల్ల దిగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అలాగే విదేశీ మారక నిల్వలపై కూడా ప్రభావం పడుతోంది. రూపాయిని నిలబెట్టే చర్యలేవీ ప్రభుత్వం తీసుకోవడం లేదు. కానీ నోట్ల రద్దుతో మాత్రం మరింత చెడుగుడు ఆడుతున్నారు. బహుశా ఇంతగా రూపాయి పతనం కావడం గతంలో ఎప్పుడూ జరగలేదు. మోడీ హయంలో ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే ప్రయత్నాలు జరగడం లేదనడానికి రూపాయి విలువ పడి పోవడమే ఉదాహరణగా



చూడాలి. ఆర్థికవేత్తలను కూర్చోబెట్టి సీరియస్ గా చర్చించి, రూపాయిని నిలబెట్టే చర్యలు కానరావడం లేదు. దీంతో ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగి, పేదలకు శరాఘాతంగా పరిణమిస్తోంది. డాలర్‌కు రూ.82మధ్య మారకపు రేటు కొనసాగుతోంది. తాజాగా 83కు చేరువలో ఉంది.రిజర్వుబ్యాంక్ దగ్గర ఉన్న విదేశీ మారక నిల్వలను మార్కెట్ లోకి అదనంగా విడుదల చేసినప్పటికీ, రూపాయి విలువ పతనం ఆగడంలేదు. ఇబ్బడిముబ్బడిగా దిగుమతులు కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి. అలాగే జిఎస్టీ పోటుతో దేశీయంగా ధరలు విపరీతంగా పెరుగుతూ పోతున్నాయి. దీనిని తగ్గించాలన్న డిమాండ్‌ను పట్టించు కోవడం లేదు. ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచే పనులేవీ మోడీ సర్కార్ చేయడం లేదు. రూపాయి విలువ డాలర్ తో పోల్చుకున్నప్పుడు అతి తక్కువకు పడిపోయింది. గత సంవత్సరం అక్టోబర్‌లో మన విదేశీమారకపు నిల్వలు గరిష్ట స్థాయికి పెరిగాయి. కాని, ఆ తర్వాత దాదాపు 9000 కోట్ల డాలర్ల మేరకు విదేశీ నిల్వలు కరిగిపోయి, గత సెప్టెంబర్ నాటికి 55,000 డాలర్ల నిల్వ మాత్రం మిగిలింది. విదేశీ మారకద్రవ్యాన్ని వివిధ కరెన్సీలలో దాచుకుంటారు. ఆ విధంగా కొంత యూరోల రూపంలో దాచినది ఉంది. యూరో విలువ కూడా డాలర్ తో పోల్చినప్పుడు తగ్గింది. ఆ విధంగా కూడా మన విదేశీ కరెన్సీ నిల్వల విలువ డాలర్‌తో పోల్చినప్పుడు తగ్గింది. రూపాయి విలువ పడిపోకుండా నిలబెట్టడానికి మార్కెట్‌లోకి డాలర్లను ఎక్కువగా విడుదల చేసింది ఆర్‌బిఐ. అయినా కూడా రూపాయి విలువ పడిపోయింది.రూపాయి విలువ పడిపోవడం అనేది సామాన్యులకు భారంగా మారింది. దేశీయంగా కఠినచర్యలు తీసుకుంటే ఈ దుస్థితిరాదు. రూపాయి విలువ పడిపోవడం కారణంగా పెట్రో దిగుమతులకు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంది. దాని వలన పెట్రోలు డీజిల, వంటగ్యాస్ ధరలు మరింత పెరుగు తున్నాయి. అది ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ఈ ద్రవ్యోల్బణం విదేశీ మార్కెట్‌లో రూపాయి విలువ మరింత పడిపోడానికి దారి తీస్తుంది. ఆ విధంగా ద్రవ్యోల్బణం కారణంగా రూపాయి విలువ పతనం అన్న చక్ర భ్రమణం సాగుతోంది. రూపాయి విలువ పడిపోవడం కారణంగా మన దిగుమతులు మరింత ప్రియం అవుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా పశ్చిమదేశాలు రష్యాపై విధించిన ఆంక్షల వల్ల పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి పోయాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడమనే ప్రహసనం చివరికు ప్రజల కొనుగోలు శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విదేశీ విద్య మరింత భారం అవుతోంది. విదేశీ ప్రయాణాలు కూడా భారంగా మారుతున్నాయి. మొత్తంగా రూపాయి విలువ పడిపోవడం అనేది ప్రజల మీద మరింత పెద్ద దాడిగా పరిణమిస్తుంది. ఒకవేళ ఏదైనా తాత్కాలిక పరిణామం కారణంగా రూపాయి విలువ పడిపోతే, తిరిగి కొద్దికాలంలోనే మళ్ళీ కోలుకుని పెరిగే అవకాశం ఉంటుంది. అయితే, ప్రస్తుతం రూపాయి విలువ పతనానికి కారణాలు వ్యవస్థీకృతమైనవిగా భావించాలి. విదేశీ చెల్లింపుల లోటు పెరిగిపోడానికి కారణం విదేశీ వ్యాపారంలో ఎగుమతులకన్నా దిగుమతుల విలువ ఎక్కువగా ఉండడం అని గుర్తించాలి. మన ఎగుమతులు పెరుగుతున్న వేగంతో పోల్చినప్పుడు దిగుమ మరోవైపు దిగుతులు ఇంకా వేగంగా పెరిగి పోతున్నాయి. అయితే దీనిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం తప్ప రూపాయి బలోపేతనాకి తీసుకుంటున్న చర్యలు కానరావడం లేదు.

# రాష్ట్ర సంబంధాలు వేరు.. రాజకీయ పోరాటాలు వేరని గుర్తించాలి

కేంద్ర రాష్ట్ర సంబంధాలు వేరు..రాజకీయ పోరాటాలు వేరని గుర్తించాలి. రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలను ఎప్పుడూ నిలదీయడంలోనూ వెనకడుగు వేయరాదు. పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా గమనించాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను



విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కొత్త నిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసాగించాలి. రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. ఇదే సందర్భంలో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఇకపోతే సిఎంలుగా ప్రతి ఒక్కరూ ప్రధానితో నిరంతరం సమీక్షించుకునే అవకాశాలు ఉండాలి. కనీసం ఒక్కో రాష్ట్రానికి ప్రధాని నెలలో ఒకరోజయినా సమయం కేటాయించి రాష్ట్రాల బాగోగులు, సమస్యలు చర్చించాలి. నీతి ఆయోగ్ సమావేశలను కూడా కనీసం మూడు నెలలకో మారయినా సమావేశ పరచి చర్చిస్తే మంచిది. ధాన్యం సేక రణ, నదీజలాల కేటాయింపు సమస్యలు,విద్యుత్ సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు వంటివి ఏవైనా రాష్ట్రాలతో చర్చించాలి. వాటిని విశ్వాసంలోకి తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్ర రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు పెరగాలి. జగన్ కావచ్చు.. మమతా బెనర్జీ కావచ్చు.. లేదా మరే ఇతర రాష్ట్ర సిఎం అయినా కావచ్చు పాలనాపరమైన విషయాల కోసం కేంద్రంతో నిత్యం సంబంధాలు నెరపాల్సిందే. ఎవరైనా కేంద్రంతో నిరంతరాయంగా అనుసంధానం అవుతూనే ఉండాలి. ఫెడరల్ వ్యవస్థలో సిఎంలు ప్రధానిని ,కేంద్ర మంత్రులను, కేంద్ర అధికారులను కలవడం సర్వసాధారణం. ఇది విమర్శించే రాజకీయ పార్టీలు గుర్తించాలి. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో సిఎంలుగా ఉన్న కెసిఆర్, జగన్‌లు తమకు అనుకూలమైన పద్ధతిలోనే పాలన చేస్తున్నారు. తప్ప ఎలాంటి విమర్శలకు జడవడం లేదు. ఇదే సందర్భంలో కేంద్ర రాష్ట్రాల మధ్య పన్నుల విధానంలో పారదర్శకత ఉండాలి. జిఎస్టీ విషయంలో ప్రధానంగా చర్చించాలి. ఏయే రంగాలు కదులేవుతున్నదీ చర్చించాలి. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందగలదన్న విశ్వాసంతో కేంద్రం ముందుకు సాగాలి. అవినీతి విషయంలో కూడా ఎవరు చేసినా చట్టబద్దంగా శిక్షకు గురి కావాల్సిందే. ఇందులో బెదిరింపు రాజకీయాలకు తావుండరాదు. ఇకపోతే పలు పెండింగ్ ప్రాజెక్టులు, జిఎస్టీ నిధుల విడుదలకు సంబంధించి కేంద్రంతో సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ కూడా పరిష్కరించుకోవడం సిఎంల కర్తవ్యం. ఇవన్నీ చక్కబెట్టుకోవడం కోసం ఢిల్లీకి వెళ్లాల్సిందే.





# గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాల వెలికితీత

**చీఫ్ మినిస్టర్ కప్-2023 క్రీడా పోటీల ప్రారంభం**

**కెసిఆర్ దృష్టి గ్రామాలపైనే అన్న వేముల ప్రశాంత్ రెడ్డి**

**నిజామాబాద్,మే22 (ప్రజా మంటలు):** గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో చీఫ్ మినిస్టర్ కప్-2023 క్రీడా పోటీలను నిర్వహిస్తున్నదని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సీఎం కప్ - 2023 జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారం భించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారు ప్రతిభను చాటుకునేందుకు వీలుగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టి ఎల్లప్పుడూ గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతిపైనే కేంద్రీకృతమై ఉంటుందన్నారు.

ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంత క్రీడాకారుల కోసం ప్రతి గ్రామ పంచాయతీలో, పట్టణ ప్రాంతాల్లోని అన్ని వార్డుల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేశారని వెల్లడించారు. వీటిని సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని పిలుపు నిచ్చారు. జిల్లా నుంచి మలావత్ పూర్ణతోపాటు నిఖత్ జరీన్, యెండల సౌందర్య, గుగులోత్ సౌమ్య, హుసాముద్దీన్, ఇషాసింగ్ వంటి అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడల నిర్వహణకు సహకరిస్తున్న పీడీలు, పీఈటీలను అభినందించారు. ఆరోగ్య పరిరక్షణకు, మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడే క్రీడలను ప్రతి ఒక్కరు అలవాటుగా మార్చుకోవాలని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజ మని, ఓడిన వారు నిరాశ చెందకుండా గెలుపొందిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. సీఎం కప్-2023 పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ఈ నెల 15, 16, 17వ తేదీల్లో మండల స్థాయిలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రస్తుతం జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నెల 28 నుండి 31 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో జరుగనున్న పోటీల్లోనూ జిల్లాకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను చూపాలన్నారు.

# కెసిఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

**ఆయనను కాపాడుకోవాల్సిందే**

**వేర్వేరు ఆత్మీయ సమ్మేళనాల్లో ఎర్రబెల్లి**

**వరంగల్,మే22(ప్రజా మంటలు):** ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కాపాడుకుంటేనే ప్రజలకు లాభం జరుగుతుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆయన వల్లే తెలంగాణ ముఖచిత్రం మారిందని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలం మాదాపురం, అప్పిరెడ్డి పల్లె గ్రామాలకు కలిపి పడమటి తండాలో, సింగరాజు ప్లలె, నీర్మాల గ్రామాలకు కలిపి సింగరాజు ప్లలె తుమ్మ గార్డెన్‌లో వేర్వేరుగా జరిగిన ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తిలో ప్రజలు మూడుసార్లు బిడ్డగా భావించి ఎన్నుకున్నారని.. ఈ ఆదరణను మరిచిపోలేనన్నారు. నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకోవడంతో పాటు అన్నిరంగాల్లో అభివృద్ధి చేడయమే తన లక్ష్యమన్నారు. రాష్ట్రంలోనే పాలకుర్తిని అన్నిరంగాల్లోనే ఆదర్శంగా నిలుపుతానన్నారు. ప్రజలకు తలవంపులు తెచ్చే పనులేవీ తాను చేయనన్నారు. నియోజకవర్గంలోని 20వేల మంది మహిళలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. కేంద్రం పెంచుతున్న ధరలతో ప్రజలపై భారపడుతుందని మంత్రి అన్నారు. 70 సంవత్సరాలు పాలించిన పార్టీలు అభివృద్ధి చేస్తే.. ప్రస్తుతం ఇంత చేయాల్సి వచ్చేదా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న చేయలేని పనులు ఇక్కడ చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని, అలాంటివారిని నమ్మితే నట్టేట



మునిగినట్టేనన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రూ.500 మించి ఎక్కడైనా పెన్షన్ ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. రైతుబంధు తరహాలో పెట్టుబడికి నిధులు ఇస్తున్నారా? నిలదీశారు. ఆయా పార్టీల పాలిత రాష్టాల్లో అమలు చేయని పథకాలను తెలంగాణలో అమలు చేస్తామని ఎన్నికలు, కోట్ల కోసం ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. గతంలో తెలంగాణలో ఏడుగంటలకు దిక్కులేదని, ఇవాళ 24గంటల కరెంటు ఇస్తున్నామన్నారు. విద్యుత్ మోటార్లకు మీటర్లు మిగిస్తామని కేంద్రం చెబితే.. ప్రాణమున్నంత వరకు మీటర్ల పెట్టనివ్వనన్న మహానేత కేసీఆర్ అని కొనియాడారు. ఏటా రూ.10,500కోట్లకుపైగా రైతుల తరపున విద్యుత్ సంస్థలకు చెల్లించి.. ఉచితంగా కరెంటు ఇస్తున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రూ.200 గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి.. రూ.1200 చేశారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి.. నేడు ప్రజలపై పెనుభారం మోపారన్నారు. పొన్నాల లక్ష్మయ్య పొంకనాలే తప్ప మంత్రిగా ఉండి.. ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్‌ను కాపాడుకుంటేనే.. మన్ని కాపాడుతాడని, మనకు లాభం జరుగుతుంద న్నారు. అన్ని సందర్భాల్లో కేసీఆర్‌కు అండగా నిలబడాలని, రాష్ట్రాన్ని తెచ్చిన నేతను కడుపులో పెట్టుకొని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని శ్రేణులకు చదివి వినిపించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి మంత్రి భోజనాలు చేశారు.



# మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం: తలసాని**

**హైదరాబాద్,మే22(ప్రజా మంటలు):** తెలంగాణఏర్పడితన తర్వాత మత్స్యరంగం ఎంతో అభివృద్ధి చెందిందని, మత్స్యకారులు సంతోషంగా ఉన్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే దేశంలో ఎక్కడా లేనివిధంగా కోట్లాది రూపాయల వ్యయంతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరులలో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని మత్స్య భవన్‌లో మత్స్య సహకార సొసైటీల చైర్మన్‌గా పిట్టల రవీందర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి తలసాని మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత మత్స్యకారులు ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. పూడిపోయి, పిచ్చిమొక్కలతో నిండిన చెరువులను స్వరాష్ట్రంలో మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించుకున్నామని చెప్పారు. నూతన రిజర్వాయర్‌ల నిర్మాణంతో నిరంతరం చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్న విషయాన్ని గుర్తుచేశారు.

# క్రీడలతో మానసకి రుగ్మతలు దూరం

**సిఎం కప్ పోటీల్లో మంత్రిజగదీశ్ రెడ్డి**

**సూర్యాపేట,మే22(ప్రజా మంటలు):** క్రీడలతో మానసిక రుగ్మతలకు చెక్‌పెట్టవచ్చని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ స్టేడియంలో సోమవారం సీఎం కప్-2023 పోటీలను రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. తొలుత అఖండ జ్యోతిని వెలిగించి బెలూన్స్‌ను గాల్లోకి వదిలి పోటీలను ప్రారంభించారు.



స్వయంగా క్రీడాకారులతో కలిసి ఆటలు ఆడుతూ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమేనన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి అన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అన్నారు. అందులో భాగమే సీఎం కప్-2023 పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# మణిపూర్‌లో మరోసారి ఘర్షణలు

**పలు ఇళ్లకు ఆందోళనకారులు నిప్పు**

**ఇంఫాల్,మే22(ప్రజా మంటలు):** మణిపూర్‌లో మరోసారి ఘర్షణలు చెలరేగాయి. తాజాగా ఓ స్థలం విషయంలో మెయిటీ, కుకీ తెగల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. రాజధాని ఇంఫాల్‌లోని న్యూ చెకాన్ ప్రాంతంలో పలు ఇళ్లకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. దాంతో వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వం.. భద్రతా బలగాలను మోహరించింది. మంటలు అంటుకున్న ఇళ్లల్లో చిక్కుకున్నవారిని కాపాడేందుకు సహాయక చర్యలు ప్రారంభించింది. హింసాత్మక ఘటనలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించకుండా కర్ఫ్యూ విధించింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. ఏప్రిల్ నెలలో ఆందోళనలు కొనసాగడంతో రాష్ట్రంలో భద్రతా బలగాలను మోహరింప చేశారు. మణిపూర్ లో ప్రస్తుతం చెలరేగిన అల్లర్లకు మూలం కొన్ని దశాబ్దాలుగా ఇక్కడి జాతుల మధ్య నెలకొన్న వైరమే కారణం అని అంటున్నరు. రాష్ట్రంలో మెజారిటీలుగా ఉన్న మెయిటీలకు గిరిజనుల(ఎస్టీ) హోదా కట్టబెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై గిరిజన సంస్థలు ఆందోళనలను ఉధృతం చేశాయి. అవి నిర్వహించిన సంఘీభావయాత్ర హింసాత్మక ఘటనలకు



దారితీసింది. కొన్నిరోజుల పాటు రాష్ట్రంలో నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి. ఆ ఘటనల్లో దాదాపు 70 మంది వరకూ ప్రాణాలు కోల్పోయారు. ఆర్మీ, పారామిలిటరీ, పోలీసులను మోహరించి, కొద్దిరోజుల తర్వాత పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కానీ... మళ్లీ అక్కడి వాతావరణం మొదటికొచ్చేలా కనిపిస్తోంది. ఇంతకుముందు మణిపూర్ లో రెండో అతిపెద్ద పట్టణమైన చురాచాంద్‌పూర్ ఈ ఘర్షణలకు కేంద్ర బిందువుగా మారింది. కొద్దిరోజుల క్రితం ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పాల్గొనాల్సిన సభావేదికను ఆ ప్రాంతంలో నిరసనకారులు దహనం చేసిన విషయం తెలిసిందే.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**హైదరాబాద్,మే22(ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో రాష్ట్ర సాధన నుంచి నేటిదాకా పదేండ్లకు చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానాన్ని, తెలంగాణ పొందుపరిచారు.

వీటితోపాటు తెలంగాణ తల్లి, బతుకమ్మ, బోనాలు, పాలపిట్ట, అమరవీరుల స్మారకంతో కూడిన తెలంగాణ అస్తిత్వ చిహ్నాలతో తెలంగాణ ఖ్యాతి మరింత ఇనుమడించేలా తెలంగాణ రాష్ట్ర



అస్తిత్వాన్ని ప్రతిబింబించే విధంగా ప్రభుత్వం రూపొందించిన లోగోను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు గారు సెక్రటేరియట్ లోని తన ఛాంబర్ లో సోమవారం ఆవిష్కరించారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ మోడల్ గా దేశ ప్రజలు ఆదరిస్తున్న రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కాళేశ్వరం వంటి సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్తు, వ్యవసాయం, మిషన్ భగీరథ, సాంస్కృతిక, యాదాద్రి వంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు, మెట్రో రైలు, టీ-హబ్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం చిహ్నాలను ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు లోగోలో అవతరణ దశాబ్ది ఉత్సవాల లోగో రూపుదిద్దుకుంది.

ఈ కార్యక్రమంలో మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్ రెడ్డి, బాల్క సుమన్, సీఎం ప్రధాన సలహాదారు సోమేశ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ శాంతి కుమారి, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.




# 2వేల నోట్ల రద్దుపై సవాల్

**డిల్లీ హైకోర్టులో పిల్ దాఖలు**

**న్యూఢిల్లీ,మే22(ప్రజా మంటలు):** రూ.2000 నోటును చలామణి నుంచి ఉపసంహరిస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఎలాంటి రిక్విజిషన్ స్లిప్, గుర్తింపు కోసం తగిన రుజువు చూపించడకుండానే రూ. 2,000 నోట్ల మార్పిడిని ఆర్‌బీఐ అనుమతించిందని ఈ పిల్ లో పేర్కొన్నారు. అంతేకాదు.. మే19న ఆర్‌బీఐ నోటిఫికేషన్, మే 20న ఎస్‌బీఐ నోటిఫికేషన్‌లు ఏకపక్షంగా, అసంబద్ధంగా ఉన్నాయని లాయర్ అశ్విని ఉపాధ్యాయ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మే 19న రూ.2,000 నోట్లను చెలామణిని ఉపసంహ రిస్తున్నట్లు ప్రకటించింది. అంతే కాదు రెండు వేల నోట్లను బ్యాంక్ లో తిరిగి సమర్పించడానికి సెప్టెంబర్ 30వరకు గడువు విధించింది. చలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల మొత్తం విలువ రూ.6.73 లక్షల కోట్ల నుంచి 3.62 లక్షల కోట్లకు తగ్గిందని, అంటే రూ.3.11 లక్షల కోట్లు వ్యక్తుల లాకర్లలోకి చేరాయని, లేదంటే వేర్పాటువాదులు నిల్వ చేశారని ఉపాధ్యాయ పేర్కొన్నారు. ఉగ్రవాదులు, మావోయిస్టులు, డ్రగ్ స్మగ్లర్లు, మైనింగ్ మాఫియాలు, అవినీతిపరుల వద్ద రెండు వేల నోట్లు ఉన్నాయన్నారు లాయర్ అశ్విని ఉపాధ్యాయ్. గుర్తింపు రుజువు లేకుండానే రూ. 2,000 నోట్లను మార్చుకునేందుకు ఆర్‌బీఐ అనుమతి ఇవ్వడం సరికాదని, అవినీతిపరులు నల్లధనాన్ని తెల్లగా ఈజీగా మార్చుకోవచ్చు అంటూ ఉపాధ్యాయ్ తెలిపారు. రద్దు చేసిన రెండు వేల నోట్లను బ్యాంకు ఖాతాల్లో మాత్రమే జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆర్‌బీఐ, ఎస్‌బీఐలను కోర్టు ఆదేశించాలని పిఐఎల్ లో పేర్కొన్నారు.

# కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం

**ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన**

**కరీంనగర్,మే22(ప్రజా మంటలు):** ఆధ్యాత్మిక చింతనతో కరీంనగరం మురిసిపోయింది. గోవిందనామస్మరణతో పులకించి పోయింది. సోమ వారం ఉదయం మిథునలగ్నంలో భూకర్షణంతో



తిరుమల శ్రీవారి ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. తెల్లవారుజామునుంచే ఆలయం నిర్మించే స్థలంలో వేదపండితులు ప్రత్యేక పూజాకార్య క్రమాలు చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో భూకర్షణ హోమం, కలశారాధన, అష్టదిక్పాలకుల పూజ, మండప పూజ, కన్యకాపూజ, గోపూజ, ముత్తైదువ పూజ నిర్వహించారు. అనంతరం శ్రీవారి గర్భాలయం నిర్మించే స్థలంలో నాగలితో దున్ని నవధాన్యాలు వెదజల్లారు. ఈ కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సమేతంగా హాజరు కాగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, జిల్లా కలెక్టర్ ఆర్వీ. కర్ణణ్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జీవీ. రామకృష్ణారావు, మేయర్ సునీల్ రావు తదితరులు హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

# కెసిఆర్ పాలనలో కులానికో న్యాయం

**త్వరలోనే అవినీతిని బయటపెడతా: ప్రవీణ్**

**హైదరాబాద్,మే22(ప్రజా మంటలు):** సీఎం కేసీఆర్ పాలనలో కులానికో న్యాయం జరుగుతున్నదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఏప్రిల్‌లో మియాపూర్ పీఎస్‌లో జరిగిన ఎసిబి దాడిలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డిని జైలుకు పంపించిండ్రు.. కానీ లంచం తీసుకొని రమ్మని పురమాయించిన ఎస్‌ఐ యాదగిరిరావును ఎందుకు జైలుకు



పంపించలేదని ప్రశ్నించారు. జైలుకు పంపడానికి వాళ్లకు దమ్ము సరిపోలేదన్నారు. ఎందుకంటే దీని వెనుక సీఎంఓ ఉందని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఇటీవల డిస్మిస్ అయిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర రావు గురించి ఎవరూ మాట్లాడలేదని.. ఎందుకంటే అతనిది పేద రజక కులం అని అన్నారు. నయీం కేసుల్లో దందాలు చేసి కోట్లు సంపాదించుకున్న ఎంతమంది అగ్రవర్ణాలకు చెందిన అధికారులు ఇప్పుడు రాజుల్లాగా ఫాంహౌసులు కట్టుకొని ఉన్నారని అన్నారు. వీటికి సంబంధించి తన దగ్గర అన్ని ఆధారాలున్నాయని... సరైన సమయంలో బయట పెడతానని హెచ్చరించారు.

# పార్లమెంట్ ప్రారంభంలో ముర్మకు ఆహ్వానమేదీ

**కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శలు**

**న్యూఢిల్లీ,మే22(ప్రజా మంటలు):** నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును, ఆమెకు ముందు రాష్ట్రపతిగా వ్యవహరించిన రామ్‌నాథ్ కోవింద్‌లను ఆహ్వానించలేదని ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను అగౌరవపరుస్తోందని, రాష్ట్రపతి కార్యాలయాన్ని లాంఛనప్రాయం చేసిందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 28న నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభిస్తారని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసమే మోదీ ప్రభుత్వం దళిత, గిరిజన వర్గాల నుంచి రాష్ట్రపతులను ఎన్నికయ్యేలా చూసినట్టు కనిపిస్తోందని ఖర్గే దుయ్యబట్టారు. పార్లమెంట్ దేశ అత్యున్నత శాసనవ్యవస్థని, రాష్ట్రపతి ప్రభుత్వంతో పాటు విపక్షం, దేశ పౌరులందరి ప్రతినిధి అని ఖర్గే ట్వీట్ చేశారు.





## నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు అమ్మితే కఠిన చర్యలు : ఎస్పీ భాస్కర్

**జగిత్యాల మే 22 (ప్రజామంటలు):** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లో పరిధిలో పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా కలిసి సీడ్స్, ఫర్టిలైజర్ షాప్స్ ను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి షాప్స్ లో ఏమైనా నకిలీ విత్తనాలు ఉన్నాయని ఆరా తీశారు. అలాగే సరైన ధ్రువపత్రాలు కలిగి ఉన్నారా లేదా అని బిల్ బుక్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదికారులు మాట్లాడుతూ... ఆరుగాలం కష్ట పడి రైతులు వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తుంటారు వారికి నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు అమ్మి మోసం చేస్తే షాపుల యజ మానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మి పట్టుబడిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో ప్రతి ఒక్కరూ రిసిప్ట్ ఇవ్వాలని సూచించారు. అలాగే రైతులు కూడా విత్తనాలు ఎరువులు కొనేముందు తప్పకుండా రసీదు తీసుకోవాలని పంట పండేంతవరకు రసీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. రైతులు విత్తనాలు కొనేముందు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తీసుకొని విత్తనాలు కొనాలని తెలిపారు. మండలంలో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే వారి సమాచారం పోలీసులకు ఇవ్వాలని వారి వివరా లను గోప్యంగా ఉంచి అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీలలో వ్యవసాయ అధికారులు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీరు, నేను కార్యక్రమంలో భాగంగా రామోజీ పేట్ గ్రామంలో ఎమ్మెల్యే పల్లె నిద్ర

**రాయికల్ మే 22 (ప్రజామంటలు):** మండల రామోజీ పేట్ గ్రామంలో మీరు, నేను కార్యక్రమంలో భాగంగా పల్లె నిద్ర చేసి ఉదయం గ్రామంలో,



వడ్డెర కాలనీలో పర్యటిస్తూ, సమస్యలను తెలుసుకుంటూ, అభివృద్ధి పనులను పరిశీలించి, రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి, 14 లక్షలతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. మహిత పూర్ గ్రామానికి చెందిన ఇద్దరు లబ్దిదారులకు 70 వేల రూపాయల సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. అనం తరం కార్యకర్తలు ప్రజలు నాయకులతో కలిసి ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అల్పాహారం చేసారు.



హైదరాబాద్‌లో జరిగిన బీసీల రాష్ట్ర కార్యవర్గ సదస్సులో పాల్గొన్న జిల్లా నాయకులు

## విద్యుత్ అంతరాయ సమాచారం

**జగిత్యాల మే 22 (ప్రజామంటలు):** తేదీ: 23.05.2023 మంగళవారం ఉదయం 7.00 గంటల నుండి 10:30 గంటల వరకు 11 కెవి లైన్ కు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు దృష్ట్యా (పిఎంఐ) జగిత్యాల టౌన్-1 సెక్షన్ పరధిలో టౌన్ 2 మరియు లోని యావర్ రోడ్ లెఫ్ట్ సైడ్ , పిక్ అప్ పాయింట్ బేకరి పక్క సంధి, ఎండి శంకర్ హాస్పిటల్ ఏరియా, శ్రీరాం నగర్, మార్కెట్ ఏరియా, బాలాజీ నగర్, ద్వారకానగర్, ఏరియా లలో విద్యుత్ సప్లై నిలిపి వేయబడును. కావున వినియోగదారులు సహకరించగలరు.

## కార్డియక్ అరెస్ట్‌తో గాంధీ ఆసుపత్రి పీజీ డా. ఫణీంద్ర మృతి

### 5 నెలల క్రితమే వివాహం



**సికింద్రాబాద్, మే 22 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రిలో పీడియాట్రిక్స్ విభాగంలో సర్జరీగా పనిచేస్తున్న డాక్టర్ ఫణీంద్ర (37 ) సోమవారం కార్డియక్ అరెస్ట్‌తో చనిపోయినట్లు గాంధీ ఆసు పత్రి వైద్యులు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజు రాబాద్ కు చెందిన ఫణీంద్రకు గత 5 నెలల క్రితమే వివాహమైంది. ఆయన భార్య గైనకాల జిస్ట్‌గా పనిచేస్తున్నారు. వీకేండ్ లో వీరు కలుసుకుంటారని, ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున 4:00 గంటలకు గుండె నొప్పి తో రూమ్ లో కుప్పకూలగా, పక్కనే ఉన్న భార్య వెంటనే గాంధీ ఆసుపత్రికి తీసు కొచ్చారు. కాని మార్గమద్యంలోనే ఆయన ప్రాణాలు విడిచాడు. డాక్టర్ ఫణీంద్ర ప్రాణాలు కాపాడటానికి తాము చాలా శ్రమించామని, కాని ఫలితం దక్కలేదని పీడియాట్రిక్ హెచ్.వో.డీ. ప్రొఫెసర్ నాగార్జున తెలి పారు. సోమవారం సాయంత్రం హుజురాబాద్‌లో జరిగిన డా. ఫణీంద్ర అంత్యక్రియల్లో తోటి డాక్టర్లు పాల్గొని, కడసారి వీడ్కోలు పలికారు.

## మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌లను సన్మానించిన తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక

**చిగురుమామిడి మే 22 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులకు మరి ముఖ్యంగా నాయీ బ్రాహ్మణులకు ఒక లక్ష రూపాయలను ప్రతి ఒక్కరికీ ఇచ్చే నిర్ణయం చేయడంతో అది ఎంతగానో మాకు ఆర్థికంగా ఉపయోగపడుతుందని కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారి జీవితాలలో వెలుగులు తెచ్చి ప్రతి నాయీ బ్రాహ్మణుడి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ పథకం పనిచేస్తుందని రాష్ట్ర మంత్రి వర్యులు గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు తీసుకుందని దానిలో ప్రతి క్షౌరశాలకు భాగంగానే 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వడం గానీ రాష్ట్ర రాజధానిలో ఆత్మగౌరవ భవనం స్థలం కేటాయించి భవన నిర్మాణానికి కోటి రూపాయల బడ్జెట్‌ను కేటాయించడం జరిగిందని నాయీబ్రాహ్మణ సోదరులు కూడా అతి త్వరలోనే ఐక్యతగా ఎర్పడి ఆత్మ గౌరవ భవనం నిర్మించుకోవాలని వారు అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ నాయీబ్రాహ్మణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం నాయీబ్రాహ్మణ సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుందని మనం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న కరెంటు సమస్యను తెలంగాణ ప్రభుత్వం కేసిఆర్ నాయకత్వంలో పరిష్కారం లభించిందమి హైదరాబాదులో ఆత్మగౌరవ భవనం కేటాయించడం, జిహెచ్ఎంసి ఎన్నికల్లో రెండు కార్పోరేటర్ టికెట్లు ఈ విధంగా నాయీబ్రాహ్మణుల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని వారు అన్నారు ఈ సందర్భంగా కరీంనగర్ లో రాష్ట్ర మంత్రివర్యులు గంగుల కమలాకర్ ని అదేవిధంగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ నీ కలిసి తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక ఆద్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవుదుర్తి విజేయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ముత్యాల లక్ష్మయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరాముల రమేష్, గర్శకుర్తి శంకర్, రాష్ట్ర నాయకులు శ్రీరాముల బలసురేందర్, జిల్లా నాయకులు కల్యాణం శ్రీనివాస్, గర్శకుర్తి నర్సయ్య, గర్శకుర్తి రాజశేఖర్, గుంజపడుగు పవన్ కుమార్, జనగామ సత్తయ్య, జనగామ





పర్శారం కొత్వాల అశోక్, అవుదుర్తి కిశోర్, అవుదుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల ప్రభుత్వ భూముల్లో ఆక్రమ నిర్మాణాలు

### స్థానికేతరులకు, ధనికులకు స్థలాలు కేటాయింపు

### జగిత్యాల జిల్లా కలెక్టర్ కు పిర్యాదు

### చర్యలు తీసుకోవాలని కోరుట్ల డెవలప్మెంట్ ఫోరమ్ డిమాండ్

**కోరుట్ల టౌన్ మే 22 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ భూముల్లో ఇతర ప్రాంత వాసులకు, ధనికులకు, కుల సంఘాలకు ఎకరాల కొద్ది స్థలాలను ఇవ్వడం సరైంది కాదని, సర్వే నెంబర్ 1300 లో దాదాపు 30 మందికి పైగ మేట్పల్లిలోని కొందరు విలేకరులకు వివిధ గ్రామాలకు వచ్చిన ఇండిపెండెంట్ డబుల్ బెడ్రూం ఇండ్లను కుదించి కోరుట్ల పట్టణ భూముల్లో వారికి కట్టించి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తు కోరుట్ల డెవలప్మెంట్ ఫోరమ్ పక్షాన సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషకు ప్రజావాణి లో పిర్యాదు చేసినట్లు ఫోరమ్ కన్వీనర్, కో-కన్వీనర్ చెన్న విశ్వనాథం, పేట భాస్కర్ లు తెలిపారు. ఈ సందర్భంగా వాటిని వెంటనే రద్దు చేయాలని ఎలాంటి ధృవపత్రాలు కాని ఇంటి నెంబర్లు ఇవ్వద్దని, పట్టణానికి చెందిన



అర్హులైన నిరుపేద కుటుంబాలకు, విలేకరులకు ఇవ్వాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషను కోరినట్లు తెలిపారు. దాదాపు రెండు వేల మంది అర్హులైన నిరుపేద కుటుంబాలు గత నెల రోజులుగా నివేశన స్థలాలు కావాలని సర్వే నెంబర్ 923 లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే పోలీస్, రెవెన్యూ అధికారులు వారిని ఇబ్బంది పెట్టారని పాలకులు మాత్రం స్థానికేతరులకు ఇండ్లు కట్టించి ఇవ్వాలని చూస్తున్నారని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

పట్టణంలోని మహాలక్ష్మీ దేవాలయం, స్మశానవాటిక దారిని, మున్సిపల్ స్థలమైన బాబు జగ్జీవన్ రామ్ పార్కును, కోరుట్ల వాగును చిద్రం చేస్తు గుంతలు తోడి యథేచ్ఛగా ఆక్రమ ఇసుక రవాణా చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని, కోరుట్లకు నిషాన్ గా వుండే గడి బురుజులు, గ్రామకంఠ స్థలాలలో ఆక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పిర్యాదులో పేర్కొనగా సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే సంబం ధిత అధికారులతో నివేదిక తెప్పించుకొని చర్యలు తీసుకుం టామన్నారని తెలిపారు. ఫోరమ్ ప్రతినిధులు చెన్న విశ్వనాథం, పేట భాస్కర్, రాసకొండ పెద్ద దేవన్న, ఎగ్యారపు మురళి, ఎండి రఫీ, చిలువేరి లక్ష్మీ రాజం, పెడిమల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 5 నుంచి 7 కిలోల తరుగు దోపిడీ

### తప్ప, తాలూ పేరుతో రైస్ మిల్లర్ల మోసం

### వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

### నర్సారెడ్డి డిమాండ్

**హైదరాబాద్ మే 22 (ప్రజామంటలు):** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు సమయంలో తప్ప, తాలూ పేరుతో తరుగు విధిస్తూ రైతులను నిట్ట నిలువునా దోపిడికి గురి చేస్తూ రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై వెంటనే చర్యలు తీసుకోని రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరులతో శేర్ నర్సారెడ్డి మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే ధాన్యానికి తప్ప , తాలు పేరుతో క్వింటాలుకు 5 నుంచి 7 కిలోల వరకు రైస్ మిల్లర్లు తరుగు తీయడం దారుణమనీ , కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు , రైస్ మిల్లర్లు కుమ్మక్కై అన్నదాతలను ఇష్టానుసారంగా దోచుకుంటున్నారనీ ఆరోపించారు . రైస్ మిల్లర్ల అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు , స్థానిక ప్రజాప్రతినిధులు కూడా రైస్ మిల్లర్లతో



కుమ్మక్కై రైతులకు నష్టం చేకూరుస్తూ బహిరంగ దోపిడికి పాల్పడుతున్నారనీ ఆరోపించారు . రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామనీ రాష్ట్ర ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతూ కేవలం ప్రకటనలకే పరిమితమవుతూ చేతల్లో రైతుల కష్టాలను, నష్టాలను పట్టించుకోవడం లేదనీ, రైస్ మిల్లర్ల దోపిడికి రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని విమర్శించారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారనీ, సకాలంలో హమాలీలు, గన్ని బ్యాగులతో పాటు లారీలను సకాలంలో సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తక్షణమే వరి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నివారించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని షేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్ల చేతిలో రైతులు తరుగు పేరిట దోపిడీకి గురవుతున్నప్పటికీ రైతులను ఆదుకోవాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనీ ఆయన ఆరోపించారు. వరి ధాన్యం కొనుగోళ్లలో క్వింటాలుకు 5 నుంచి 7 కిలోల వరకు తరుగు పేరిట రైతులను దోపిడికి గురి చేస్తున్న రైస్ మిల్లర్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర పౌరసరఫరా సంబంధాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ లు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోని రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి డిమాండ్ చేశారు.

## శివసేన పార్టీ తెలంగాణలో 119 ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన

**జగిత్యాల మే 22 (ప్రజామంటలు):** సోమవారం సోమాజి గుడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివ సేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ మీడియాను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణలో శివసేన పార్టీని బలోపేతం చేయబోతున్నామని వెల్లడించారు. శివసేన పార్టీ అధినేత మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రజా ఎజెండాను సిద్ధం చేశామని తెలిపారు. గల్లీ నుంచి రాష్ట్ర రాజధాని వరకు ప్రతి సమస్య పైన పొలిటికల్ ఫైట్ చేయబోతున్నామని ప్రకటించారు. రైతుల సమస్యల పైన మరియు నిరుద్యోగ, విద్యార్థుల, మహిళ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని ఆయన అన్నారు. దళిత గిరిజన సోదరులకు సోదరీమణులకు జరుగుతున్న అన్యాయంపై, మరియు బీసీల సమస్యల పైన కూడా పెద్ద ఎత్తున ఉద్యమం చేయబోతున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరవీరులైన అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరగడం కోసం పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

### తెలంగాణలో శివసేన పార్టీ నిర్మాణం:

అత్యంత వేగంగా తెలంగాణ రాష్ట్రంలో పార్టీ బలోపేతం వైపు అడుగులు వేయబోతుందని ప్రకటించారు. ప్రతి జిల్లాలో పూర్తి కమిటీలు వేయబోతున్నామని జిల్లా అధ్యక్షులు నియోజకవర్గ కన్వీనర్లు మండల అధ్యక్షులు గ్రామ కమిటీలను వేయబోతున్నట్లు తెలిపారు. అదే విధంగా శివ సేన పార్టీ అనుబంధ భాగాలు విద్యార్థి, యువసేన, మహిళా సేన, కామ్ గార్ సేన కమిటీలు నియమించి బలమైన శక్తిగా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేసారు. బడుగు, బలహీన వర్గాలు, దళిత, బహుజన వర్గాలు తెలం గాణ అమరవీరుల కుటుంబాలు, విద్యార్థులు, నిరుద్యోగులు ప్రతీ ఒక్కరు శివ సేన పార్టీలో చెరి ప్రజా ఉద్యమం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### 119 నియోజకవర్గాల్లో పోటీ చేయబోతున్న శివసేన:

తెలంగాణ రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో పోటీ చేయ బోతున్నామని అన్నారు. ముఖ్యంగా అమరుల కుటుంబాలకు టికెట్స్ కేటాయిస్తామన్నారు. 33% శాతం మహిళలకు సీట్లు




కేటా ఇస్తామన్నారు. తెలంగాణలోని నిరుద్యోగ యువతకు తమ పార్టీ నుంచి టికెట్లు ఇస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన విద్యార్థి నాయకులకు సీట్లు కేటాయిస్తా మన్నారు.

### బీసీలకు 50 శాతం టికెట్లు:

### 50 శాతం బీసీలకు టికెట్లు ఇస్తామన్నారు.

ఎస్సీ, ఎస్టీ అన్నదమ్ములకు జనాభా ప్రాతిపదికన తమ పార్టీ టికెట్లు ఇస్తుందని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు సైతం తమ పార్టీ నుంచి టికెట్లు ఇవ్వబోతున్నట్టు తెలిపారు వీరందరికీ తమ పార్టీ నుంచి బీఫామ్ ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. శివసేన పార్టీ దృష్టి. ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ లో పోటీ చేస్తే తమ పార్టీ నుంచి ఒక రైతుని నిలబెడతామన్నారు. మంత్రి కేటీఆర్ పోటీ చేసే స్థానం పైన తమ పార్టీ నుంచి ఒక పద్మశాలి వర్గానికి చెందిన వారికి టికెట్ ఇచ్చి నిలబెడతామని హామీ ఇచ్చారు. హరీష్ రావు పైన తమ పార్టీ అభ్యర్థి అమరవీరుల కుటుంబం నుంచి టికెట్ ఇస్తామన్నారు. కవిత పైన పసుపు రైతుకు తమ పార్టీ నుంచి టికెట్ ఇస్తామన్నారు. విద్యార్థి నాయకులుగా చలామణి అయి చట్టసభల్లో ఉన్నటువంటి ఎమ్మెల్యేలు ఎంపీలుగా ఉన్న చీఫ్ లు గా, విప్ లు గా ప్రభుత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నటువంటి బాల్క సుమన్, గువ్వల బాలరాజు, గాదరి కిషోర్, శంబిపూర్ రాజు, బాబా ఫసియుద్దీన్ లాంటి వారిపై తమ పార్టీ నుంచి విద్యార్థి నాయకులకు టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్ మీట్ లో వేదిక పైన నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు పసుపులేటి గోపి కిషన్, కమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సూర్యవంశి రమేష్, యువ సేన రాష్ట్ర నాయకులు సాయి, గౌతం గౌడ్, గంగాధర్. ఈ కార్యక్రమంలో శివసైనికులు వినోద్, లోకేష్, ముని, మారుతి, విష్ణు, సిజ్జు, లింగం, రమేష్, బాను, శంకర్ మరియు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం కప్ అథ్లెటిక్స్‌లో భీమదేవరపల్లి హవా

**మూడు ఈవెంట్స్ లో ప్రథమస్థానంలో "అపూర్వ"**

**ఎంపీడీవో లంకపల్లి భాస్కర్**



**భీమదేవరపల్లి మే 22 (ప్రజామంటలు):** గ్రామీణ స్థాయి నుంచే యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ పోటీలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయిలో పోటీలలో భీమదేవరపల్లి మండలానికి చెందిన "పి. అపూర్వ" మూడు ఈవెంట్స్ లలో ప్రథమ స్థానంలో నిలిచింది. హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో బాలికల విభాగంలో భీమదేవరపల్లి మండలానికి చెందిన పి. అపూర్వ ఉమెన్స్ అథ్లెటిక్స్ లో 400 మీటర్స్ లో, 100 మీటర్స్ లో మొదటి స్థానం, లాంగ్ జంప్ లో మొదటి స్థానాన్ని సాధించి మొత్తం మూడు ఈవెంట్స్ లలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఎంపీడీవో లంకపల్లి భాస్కర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మూడు ఈవెంట్స్ లలో మండలం ప్రథమ స్థానంలో రావడం పట్ల అపూర్వ ను అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, హనుమకొండ డిసిపి బారీ, కలెక్టర్ సిక్తా నాయక్, భూపాలపల్లి జెడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి క్రీడాకారులను అభినందించారు.

## ఐపీఎల్ - క్రికెట్ బెట్టింగ్ ప్లేయర్ల అరెస్ట్

**డాఫా బెట్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్**

**హనుమకొండ మే 22 (ప్రజామంటలు):** వరంగల్ జిల్లాలోని ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ చౌరస్తా సమీపంలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ గురించి టాస్క్ ఫోర్స్ బృందం కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, పోలీసులు నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరు డాఫా బెట్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న వారిపై దాడి చేసి వారి నుండి రూ. 80,000 నాలుగు




స్మార్ట్ ఫోన్‌లు, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారితో పాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి చర్యల కోసం ఇంతేజార్ గంజ్ పోలీసులకు అప్పగించారు.

**పట్టుబడిన నిందితుల వివరాలు:** చింతం సాయి కుమార్ నివాసం ఫోర్ట్ వరంగల్, వరంగల్, పస్తం వినోద్ కుమార్, నివాసం శంబునిపేట, వరంగల్, చింతం కపిల్, ఫోర్ట్ వరంగల్, గట్టు దర్శనం రంగ శాయిపేట, వరంగల్ కు చెందిన వారని తెలిపారు. ఈ నిందితులను పట్టుకున్న వారిలో ఏసీపీ డా. ఎం. జితేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు కె. జనార్ధన్ రెడ్డి, కె. శ్రీనివాసరావు, ఎస్‌ఐలు బి. శరత్, వి. లవన్ కుమార్, టాస్క్ ఫోర్స్ బృందం ఉన్నారు.

## ముగిసిన నవగ్రహ సహిత ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం

**కోరుట్ల టౌన్ మే 23 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణంలోని సాయిరాం నగర్ కాలనీలోని శివ పంచాయతన భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న నవగ్రహ సహిత ధ్వజస్తంభ



ప్రతిష్టాపనలో భాగంగా సోమవారం మూడవ రోజున ఉదయం పుణ్యాహ వాచనం మరియు స్థాపితా దేవతా పూజలు హెూమాలు తర్వాత నవగ్రహ ధ్వజ స్తంభ నాగదేవతా విగ్రహాలను పట్టణ పురోహితులు బ్రహ్మన్న గారి శంకర్ శర్మ వైదిక నిర్వహణలో ప్రతిష్టించారు. తర్వాత శాంతి కళ్యాణం



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు తులసి భానుమూర్తి శర్మ, సంపత్ కుమారాచార్య, ఫణింద్ర శర్మ, అరుణ్, సునీల్ మరియు దేవాలయ కమీటీ సభ్యులు కంచ కుమారస్వామి, మోర్తాడ్ లక్ష్మి నారాయణ, నడిగడ్డ రాజు విలాసాగర్ రవి, దు రిశెట్టి సత్యనారాయణ, శ్రీను ప్రశాంత్, కిరణ్ మరియు పాయికారి రవి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల ముసుగులో రాజకీయ కుట్రలు: ఎమ్మెల్యే, జెడ్పీ చైర్పర్సన్

**జగిత్యాల మే 22 (ప్రజా మంటలు) :** జగిత్యాల బంద్ కు పిలుపునిచ్చింది నిజమైన రైతులు కారని రైతుల ముసుగులో బిజెపి కాంగ్రెస్ పార్టీ నేతలు బంద్ నిర్వహించి రైతులను మరిన్ని కష్టాల పాలు చేశారని ఇది గుర్తించిన ప్రజలు స్వచ్ఛందంగా బంద్ ను తిరస్కరించారని బంద్ కు ప్రజల్లో స్పందన కరువైందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ.....

రైతు పక్షపాతి సీఎం కేసీఆర్ అన్నారు. రాష్ట్రం ఏర్పాటు తదుపరి రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్ర ఏర్పాటు కు ముందు తర్వాత రాష్ట్రంలో వరి దిగిబడిని సరిచూస్తేనే అర్థమవుతుందన్నారు. మెజారిటీ కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి తరుగు కోతలు లేవని ఎక్కడో ఒక చోట జరిగిన వాటిని చూపుతూ రైతులను తప్పుదోవపట్టించేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్రలకు తెరలేపుతున్నాయన్నారు. నిన్న చల్ గల్ కొనుగోలు కేంద్రంలో శుభ్రం చేసి తెచ్చిన ధాన్యంలో ఎలాంటి తరుగు కోతలు లేవంటూ రైతులే చెప్పారన్నారు. రైతుల ముసుగులో కొందరు నేతలు ప్రభుత్వంపై బురదజల్లే యత్నంలో భాగంగా రైతులను తప్పుదోవపట్టించి రైతులకే అన్యాయం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. మిల్లర్లు అన్యాయం చేస్తే మిల్లుల ముందు ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రశ్నించాల్సి ఉండగా అలా కాకుండా బంద్ పేరిట రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. బంద్ ప్రభావం కేవలం పెట్రోల్ బ్యాంకులపైనే పడిందని ఈ విధంగానూ ధాన్యం తరలించే లారీలు డీజిల్ దొరకకుండా చేశారన్నారు. రైతుల ముసుగులో బిజెపి, కాంగ్రెస్ పార్టీల నేతలు బంద్ కు పిలుపునిచ్చారన్నది ప్రజలు గుర్తించి బంద్ కు సహకరించలేదని ఎమ్మెల్యే అన్నారు. ఒక రెండు గంటలపాటు బంద్ ప్రభావం కొంతగా కనిపించిందని తదుపరి యధావిధిగా ప్రజా జీవనం కొనసాగిందని ఎమ్మెల్యే చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో కంటే నేటి తెలంగాణలో వరి దిగుబడి నాలుగింతలు పెరిగిందన్నారు. వీటికి సరిపడా 29 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యము గ్గల గోదాములను ప్రభుత్వం నిర్మించిందని ఎమ్మెల్యే చెప్పారు. రైతులకు ఉచిత విద్యుత్, చెరువుల, కుంటల అభివృద్ధి, రైతుబంద్, రైతు భీమా, గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటివి సీఎం కేసీఆర్ ముందుచూపుతో రైతులకై



ఏర్పాటు చేసినవని ఎమ్మెల్యే చెప్పారు. బిజెపి రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ రైతుల నడ్డి విరిచే ప్రయత్నాలకు పాల్పడుతోందన్నారు. ఎరువుల ధరలు పెంచి రైతులను నిండా ముంచిందన్నారు.

నల్ల చట్టాలను తెచ్చి రైతులను ముంచే ప్రయత్నం చేస్తే తిరగబడ్డ రైతుల ఆగ్రహానికి జడిసిన ప్రధాని మోడీ దేశ రైతులందరిని క్షమాపణ కోరాడని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. పసుపు రైతులను మోసం చేసింది బిజెపి పార్టీ కాదా అని ఏమ్మెల్యే ప్రశ్నించారు. గత కాంగ్రెస్ పాలకుల హయాంలో రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. బిజెపి నాయకులకు చిత్త శుద్ధి ఉంటే రంగు మారిన ధాన్యాన్ని ఎఫ్.సి.ఐ తో కొనిపించాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రైతు పక్ష పాత ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని, రైతులకు శ్రీరామ రక్ష తెలంగాణ ప్రభుత్వమని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రజలకు మేలు చేయకున్నా కీడు చేయరాదని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వేడుకొన్నారు.

జడ్పి చైర్మన్ దావా వసంత మాట్లాడుతూ....... చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేసిందన్నారు. అకాల వర్షాలతో కొంత ఇబ్బంది ఏర్పడిందని తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారని దావా వసంత చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే వాటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొంటున్నారన్నారు. రైతుల వేషంలో కొన్ని పార్టీల నేతలు రైతులను ఆగం చేసే కుట్రలకు తెరలేపారన్నారు. కాంగ్రెస్, బిజెపి నాయకులకు రైతులపై ఉన్నది కాపట ప్రేమ అని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన ఛత్తీస్ ఘడ్ లో రైతుల నుంచి కేవలం 15 క్వింటాళ్ల ధాన్యం కొంటారని తెలంగాణలో అలాంటి కండిషన్స్ లేవన్నారు. రైతు సంఘాల పేరిట చేపట్టిన బంద్ ను ప్రజలు ఆదరించలేదని కేవలం కొన్ని పార్టీల నేతలు స్వార్థ రాజకీయాల కోసం చేపట్టిన రైతు బంద్ తో రైతులకే నష్టం వాటిల్లిందని జడ్పి చైర్మన్ దావ వసంత అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలుగురి దామోదర్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, జోగినిపెల్లి సందీప్ రావు, జడ్పిటిసి మహేష్, అల్లాల దామోదర్ రావు, పత్తి రెడ్డి మహిపాల్ రెడ్డి, బాల ముకుందం, జంబర్తి శంకర్ లు పాల్గొన్నారు.







# ముగిసిన మహాభాగ్య నగర బ్రాహ్మణ సేవా సమితి

## వార్షికోత్సవ వేడుకలు, పూర్ణాహుతి, శివ కళ్యాణం

**వారణాసి మే 22 (ప్రజామంటలు):** మహా భాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి 17 వార్షికోత్సవ వేడుకలు కాశీ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులపాటు కొనసాగిన వార్షికోత్సవ వేడుకలు చివరి రోజు పూర్ణహుతి, శివ కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణతో పాటు కళ్యాణ అక్షితలు అందించి మహదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గము, సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఋత్విక్ సన్మానం నిర్వహించారు.





## ప్రతిష్టాత్మక టాటా ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో డాక్టరేట్

**ముంబై రూరల్ డెవలప్మెంట్ లో**

**గట్ల నర్సింగాపూర్ వాసి "చల్లూరి బాబు"**

**భారతదేశంలో రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై బాబు పరిశోధనలు**



**భీమదేవరపల్లి మే 22 (ప్రజామంటలు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన చల్లూరి బాబు ప్రతిష్టాత్మక టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ - ముంబయిలో రూరల్ డెవలప్‌మెంట్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి అపురూపమైన ఘనత సాధించారు. ఆర్థికవేత్త డా. కృష్ణ సుధీర్ పటోజు మార్గదర్శకత్వంలో బాబు పరిశోధనలు చేశారు. భారతదేశంలోని రైతు ఉత్పత్తి సంస్థల పనితీరు, వారు ఎదుర్కొంటున్న సవాళ్లపై దృష్టి సారించారు. పిహెచ్‌డి పూర్తి చేయడంలో బాబు విజయం సాధించడం అతని కృషి, అంకితభావం, కుటుంబం, ముఖ్యంగా అన్నయ్య డా. ప్రవీణ్ కుమార్ మద్దతుతో పూర్తి చేశాడు. భారతదేశంలో రైతు ఉత్పత్తిదారుల కంపెనీల పనితీరుపై బాబు చేసిన పరిశోధనలు గ్రామీణాభివృద్ధి రంగంపై గణనీయమైన ప్రభావాలను చూపుతున్నాయి. రైతుల సాధికారత వారి జీవనోపాధిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ కంపెనీల పెరుగుదల మరియు అభివృద్ధికి తోడ్పడేందుకు సమర్థవంతమైన పరిశోధనలు సహాయ పడతాయి. ప్రస్తుతం బాబు అమెరికాకు చెందిన ఎఫ్ఎంసిజి క్యాడ్‌బరీ కంపెనీలో సౌత్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. బాబు సాధించిన ఘనత యువతరానికి స్ఫూర్తిదాయకమని, కృషి, అంకితభావం, కుటుంబ సభ్యుల సహకారం ఉంటే జీవితంలో గొప్ప విజయాలు సాధించవచ్చని నిరూపిస్తోంది. డా. బాబు చల్లూరి భవిష్యత్ ప్రయత్నాలకు గ్రామ ప్రజలు శుభాకాంక్షలు అందజేశారు.

# గంజాయి స్మగ్లర్‌పై పీడీయాక్ట్ నమోదు

**చట్ట వ్యతిరేక కార్యాలపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కేసులు**

**హన్మకొండ మే 22 (ప్రజామంటలు):** జిల్లాలో తరచుగా గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్న గంజాయి స్మగ్లర్ పై వరంగల్ పోలీసులు సోమవారం పీడీయాక్ట్ ఉత్తర్వులు జారీ చేసారు. ఆంధ్ర ప్రదేశ్ నుండి వరంగల్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్కు పాల్పడుతున్న మహారాష్ట్ర మాలేగావ్ ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ అలియాస్ యాకూబ్ పై పోలీస్ కమిషనర్ ఏ.వి. రంగనాథ్ పీడీయాక్ట్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వులను వర్ధన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ జీ. సదన్ కుమార్ నిందితుడికి చర్ల జైలులో అందజేశారు. పీడీ యాక్ట్ ఉత్తర్వులను అందుకున్న నిందితుడు గత సంవత్సరం నవంబర్ 19వ తేదిన మరో ఐదుగురు నిందితులతో కల్సి అంధ్రప్రదేశ్ నుండి మహారాష్ట్రకు గంజాయి అక్రమ రవాణాకు చేస్తుండగా జఫర్ గఢ్ పోలీసులు ఈ ముఠాను అరెస్టు చేసారు. ఈ ముఠా నుండి పోలీసులు పదిలక్షల విలువగల వంద కిలోల గంజాయితో పాటు రెండు కార్లు, ఐదు సెల్ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకొని జైలుకు తరలించారు. ఇక ముందు ఎవరైనా సులభంగా డబ్బు




సంపాదించాలనే లక్ష్యంతో యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చేందుకుగాను మత్తుపదార్థాల అక్రమ రవాణాకు ఎవరూ పాల్పడినా పాల్పడితే సహించేది లేదని అలాగే చట్ట వ్యతిరేక కార్యాలపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ క్రింది కేసులు నమోదు చేయబడుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.



## రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ పోస్టర్ ఆవిష్కరణ

**మొదటి బహుమతి లాప్ టాప్, రెండవ బహుమతి స్మార్ట్ ఫోన్, మూడవ బహుమతి టాబ్**

**జనగామ మే 22 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బలమూరు వెంకట్ ఆదేశాల మేరకు రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ పోస్టర్ ను ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభిగౌడ్ ఆవిష్కరించారు. ఈసందదర్బంగా ఆయన మాట్లాడుతూ.... హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా రాజీవ్ గాంధీ ఆన్లైన్ కాంపిటీషన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తారని, జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు మరియు యువతి యువకులు పెద్ద ఎత్తున పాల్గొని బహుమతులు



పొందగలరని కోరారు. క్విజ్ పోటీలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి లాప్ టాప్, రెండవ బహుమతి స్మార్ట్ పోన్, మూడవ బహుమతి టాబ్ ఇస్తారని, అలాగే ప్రతి అసెంబ్లీ లో 40 కన్సోలేషన్ ప్రైజస్, మరో ప్రత్యేకత ప్రతి అసెంబ్లీ లో ఒక మహిళ కి ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తారని తెలిపారు. ఆసక్తి కలిగినవారు 7661889889 నంబర్ కి మిస్డ్ కాల్ ఇచ్చి రెఫరల్ కోడ్ 0065 తో రిజిస్ట్రేషన్ చేసుకోగలరని విజ్ఞప్తి చేసారు. క్విజ్ పోటీ జూన్ రెండో తారీకు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐపిసి నాయకులు బొల్లెపల్లి కృష్ణ , రాష్ట్ర నాయకులు థారిక్ ఇలాహి, జిల్లా నాయకులు రఘు, సుజిత్ రెడ్డి, రాజ్ కుమార్, వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

### తెలుగులోకి మళయాళ

# 2018 సినిమా

### ట్రైలర్ విడుదల చేసిన చిత్రబృందం




ఈ ఏడాది మలయాళంలో వచ్చి బాక్సాఫీసును షేక్ చేసిన '2018' సినిమా హైయెస్ట్ గ్రాసింగ్ సినిమాగా నిలిచింది. కేవలం 13 రోజుల్లోనే 115 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టి రికార్డు క్రియేట్ చేసింది. అయితే ఇదే సినిమాను తెలుగులోనూ విడుదల చేసేందుకు చిత్రబృందం ఎలాన్ చేసింది. మే 26వ తేదీన టాలీవుడ్ లో 2018 అనే పేరుతో ఈ చిత్రం ప్రభంజనం సృష్టించబోతోంది. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ ను చిత్రబృందం విడుదల చేసింది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఇడుక్కి డ్యామ్ ఓపెన్ చేయడంతో వరదల కారణంగా కొందరి జీవితాలు ఎలా అతలాకుతలం అయ్యాయనే పాయింట్ తో ఈ చిత్రం ట్రైలర్ ఆసక్తికరంగా మారింది. ఇందులో మిలట్రీ నుంచి భయంతో బయటకు వచ్చిన వ్యక్తిగా టోవినో థామస్ కనిపిస్తున్నాడు. తన భార్యతో సమస్యలు ఉన్న వ్యక్తిగా వినీత్ శ్రీనివాసన్ నటించగా.. అపర్ణ బాలమురళి కూడా నటించబోతున్నారు. ఆసిఫ్ అలీ లాల్ తన్వి రాయ్ ప్రధాన పాత్రల్లో నటించారు. వరద ముప్పు నుంచి ప్రాణాలతో కొందరు ఎలాంటి పోరాటం సాగించారు వరదల కారణంంగా తాగడానికి నీరు కూడా లేకుండా ఎలాంటి ఇబ్బందులు పడ్డారన్నది ట్రైలర్ లో ఎమోషనల్ గా చూపించారు. వరదల కారణంగా ఇళ్లు మొత్తం కొట్టుకుపోయి కేవలం శిథిలాలు మాత్రమే మిగిలే సీన్‌తో ట్రైలర్‌ను ముగించారు. రోజూ చూసే సముద్రపు నీళ్ల కంటే ఇదేమీ ప్రమాదకరం కాదయ్యా అంటూ చెప్పే డైలాగ్ ఆసక్తిని పెంచుతోంది. భయం హ్యూమానిటీ హోప్ ఇన్సిపిరేషన్.. ఇలా అన్ని ఎమోషన్లను ఈ సినిమాలో చూడవచ్చు. అలాగే ట్రైలర్ లో కూడా ఇందుకు సంబంధించిన అన్ని భావాలు కనిపించాయి. ట్రైలర్ తోనే సినిమా భారీ అంచనాలను క్రియేట్ చేస్తోందీ చిత్రం. తెలుగుతో పాటు తమిళ భాషలో ఈ సినిమా శుక్రవారం విడుదల కాబోతుంది. అలాగే హిందీ కన్నడ భాషల్లో కూడా ఈ చిత్రాన్ని రిలీజ్ చేసందుకు మేకర్స్ ఎలాన్ చేస్తున్నారు. మరి ఆ భాషల్లో ఎప్పుడు రిలీజ్ అవుతుందనేది ఇంకా తెలియాల్సి ఉంది.

### తెలుగు చిత్రపరిశ్రమలో

# మరో విషాదం

### చికిత్స పొందుతూ నటుడు శరత్‌బాబుకన్నుమూత

తెలుగు చలనచిత్రరంగం మరో నటుడిని కోల్పోయింది. సీనియర్ నటుడు శరత్ బాబు సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఆయన వయస్సు 71 సంవత్సరాలు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో.. హైదరాబాద్ లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.



మొదట చెన్నై, బెంగళూరులో చికిత్స తీసుకున్న ఆయన.. మెరుగైన వైద్యం కోసం నెల రోజుల క్రితం.. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీలో హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. అప్పటి నుంచి శరత్ బాబు వెంటిలేటర్ పైనే చికిత్స పొందుతున్నారు. సోమవారం ఉదయం ఆయన ఆరోగ్యం మరింత విషమించడంతో మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. శరత్ బాబు మృతితో టాలీవుడ్ లో విషాదా ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపట్ల పలువురు సినిమా ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. శరత్ బాబు అసలు పేరు సత్యనారాయణ దీక్షితులు. 1973లో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన శరత్ బాబు.. దక్షిణాదిన అన్ని భాషల్లో నటించారు. రామరాజ్యంలో చిత్రంలో తొలిసారి తెరపై కనిపించారు శరత్ బాబు. మూడుముళ్ల బంధం, సీతాకోక చిలుక, సంసారం ఒక చదరంగం, అన్నయ్య, ఆపద్భాందవుడు, సాగరసంగమం వంటి ఎన్నో అద్భుతమైన చిత్రాల్లో శరత్ బాబు నటించారు. నెగిటివ్ రోల్స్‌లో సైతం ఆయన మెప్పించారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా శరత్ బాబు మూడు నంది అవార్డులు అందుకోవడం విశేషం. శరత్ బాబు, రమాప్రభలు పెళ్లి చేఉకుని తరవాత విడిపోయారు. ఇక శరత్ బాబు చివరగా వకీల్ సాబ్ చిత్రంలో నటించారు.

# మరో భారీ చిత్రంతో బాలయ్య

### రెండు పార్ట్‌లుగా ఉండేలా ప్లాన్

నందమూరి బాలకృష్ణ బ్యాక్ టు బ్యాక్ అఖండ మరియు వీర సింహారెడ్డి సినిమాలతో సక్సెస్ లను దక్కించుకున్నాడు. ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్న సినిమాతో బాలయ్య హ్యాట్రిక్ ను దక్కించుకోవడం ఖాయం అంటూ అభిమానులు చాలా నమ్మకంగా ఉన్నారు. ఇక బాలయ్య తదుపరి సినిమాను బోయపాటి శ్రీను దర్శకత్వంలో చేయబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో వైపు ఒక భారీ పాన్ ఇండియా మల్టీస్టారర్ సినిమాను కూడా బాలయ్య చేయబోతున్నాడు. ఇటీవలే కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ బాలకృష్ణ తో తాను కలిసి నటించబోతున్నట్లు ప్రకటించిన విషయం తెల్సిందే. బాలకృష్ణ చేయబోతున్న ఆ భారీ చిత్రం రెండు భాగాలుగా రాబోతుందట. మొదటి భాగంలో బాలకృష్ణ తో పాటు సూపర్ స్టార్ రజినీకాంత్ కనిపించబోతున్నాడని... రెండవ పార్ట్ లో బాలకృష్ణ తో పాటు కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కనిపించబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. రెండు పార్ట్ ల యొక్క షూటింగ్ ను ఒకే సారి పూర్తి చేసి ఆరు నెలల గ్యాప్ లో ప్రేక్షకుల



ముందుకు తీసుకు వచ్చే విధంగా ఎ÷-లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ భారీ మల్టీ స్టారర్ సినిమాకు గాను కన్నడ ప్రముఖ ఫిల్మ్ మేకర్ దర్శకత్వం వహించబోతున్నాడు. ఈ భారీ పాన్ ఇండియా మూవీని శివ రాజ్ కుమార్ నిర్మించబోతున్నాడు. బాలకృష్ణ మరియు శివరాజ్ కుమార్ కి ఉన్న సన్నిహిత సంబంధం నేపథ్యంలో ఈ సినిమా కార్యరూపం దాల్చడం పెద్ద కష్టం కాదనే అభిప్రాయం ను కొందరు వ్యక్తం చేస్తున్నారు. రికార్డ్ స్థాయి బ్జడెట్ తో ఒక విభిన్నమైన మల్టీ స్టారర్ గా ఈ సినిమాను రూపొందబోతోంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## శింబుతో కమల్ హాసన్ సినిమా

తమిళ స్టార్ హీరో, లోకనాయకుడు కమల్ హాసన్ మరో కొత్త సినిమాను ప్రారంబించాడు. అయితే హీరోగా కాదు నిర్మాతగా. ఈ సినిమాలో స్టార్ హీరో శింబు హీరోగా నటిస్తున్నాడు. రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ పై భారీ బ్జడెట్ తో పీరియాడిక్ డ్రామాగా తెరకేక్కనున్న ఈ సినిమాకు దేసింగ్




పెరియసామి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను మే 22 సోమవారం ఉదయం లాంచనంగా ప్రారంభించారు మేకర్స్. దీనికి సంబంధించిన ఫొటోస్ సోషల్ మీడియాలో అ÷-లోడ్ చేసారు. ఆ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. పాన్ ఇండియా లెవల్లో భారీ యాక్షన్ త్రిల్లర్ గా తెరకెక్కనున్న ఈ సినిమాకు.. భారతీయ దిగ్గజ సంగీత దర్శకుడు ఏ ఆర్ రహమాన్ స్వరాలు సమకూరుస్తున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం ముందుగా బాలీవుడ్ బ్యూటీ దీపికను అనుకున్నారు మేకర్స్. కానీ ఆమె రెమ్యునరేషన్ ఎక్కువ డిమాండ్ చేయడంతో ఆమె ప్లేస్ లో మహానటి కీర్తి సురేష్ న్న ÷నైల్ చేసారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా.. జూన్ లో సెట్స్ పైకి వెళ్లనుంది. ఇక ఈ సినిమా కోసం శింబు కూడా చాలానే కష్టపడుతున్నాడు. తన బాడీని ఫుల్ గా ట్రాన్ఫాం చేసుకున్నాడు. మరి శింబు కేరిర్ లోనే బిగెస్ట్ బ్జడెట్‌తో రానున్న ఈ సినిమా ఏ రేంజ్ విజయం సాదిస్తుందో తెలియాలంటే 2024 వరకు ఆగాల్సిందే.

### మాస్ రాజా న్యూ లుక్..

# చాలా మార్చేశాడు

ఏమాత్రం సినీ బ్యాగ్రౌండ్ లేకుండానే సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి.. చాలా ఏళ్ల పాటు కష్టనష్టాలను అనుభవించి స్టార్గా ఎదిగాడు టాలెంటెడ్ హీరో రవితేజ. ముఖ్యంగా తనదైన నటన స్టైల్‌తో సీ సెంటర్ల ఆడియెన్స్ను మెప్పించిన అతడు.. మాస్ మహారాజా అన్న బిరుదును కూడా అందుకున్నాడు. అప్పటి నుంచి ఏమాత్రం వెనక్కి తిరిగి చూడకుండానే ముందుకు సాగుతోన్నాడు. హిట్లు ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేసే రవితేజ.. ఇప్పుడు చేతి నిండా ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతోన్నాడు.



ఇందులో భాగంగానే ప్రస్తుతం అతడు 'టైగర్ నాగేశ్వరరావు' అనే పాన్ ఇండియా చిత్రంలో నటిస్తోన్నాడు. 1970 కాలంలో గజగజలాడించిన స్టువర్టుపురం దొంగ టైగర్ నాగేశ్వరరావు జీవిత కథ ఆధారంగా రాబోతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి.

'టైగర్ నాగేశ్వరరావు' మూవీలో మాస్ మహారాజా రవితేజ వైల్డ్ లుక్తో కనిపించబోతున్నాడు. తొలిసారిగా గుబురు గెడ్డం వత్తైన జుట్టుతో అతడు దర్శనమివ్వబోతున్నాడు. దీంతో మే 24వ తేదీన రాబోతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ కోసం అంతా ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా టాలీవుడ్ మాస్ హీరో రవితేజ తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో ఓ షాకింగ్ ఫొటోను షేర్ చేశాడు. సోషల్ మీడియాలో యమ యాక్టివ్గా ఉండే రవితేజ తాజాగా తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫొటోలను షేర్ చేశాడు. వీటిలో ఈ స్టార్ హీరో గుబురు గెడ్డంతో పాటు టోపీని ధరించి కనిపించాడు. అంతేకాదు ఈ చిత్రాలో అతడు కాస్త బొద్దుగా కూడా ఉన్నాడు. దీంతో ఇందులో ఉన్నది రవితేజ అని చాలా మంది గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ఈ ఫొటోలకు నెటిజన్ల నుంచి భిన్నమైన కామెంట్లు కూడా వస్తున్నాయి. ఇలా ఇవి బాగా వైరల్గా మారిపోయాయి. ఇదిలా ఉండగా.. మాస్ మహారాజా రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు' మూవీతో పాటు 'ఈగల్' అనే మరో చిత్రాన్ని కూడా చేస్తోన్నాడు. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కూడా చాలా వరకూ పూర్తైంది. అలాగే త్వరలోనే అతడు అనుదీప్ కేవీ దర్శకత్వంలోనూ ఓ సినిమా చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## క్యారెక్టర్ ఆర్టిస్టుగా పేరు సంపాదించిన శరత్ బాబు

సినిమా రంగంలో శరత్ బాబు హీరోగా సక్సెస్ కాలేకపోయినా.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణించారు. 300కు పైగా సినిమాల్లో నటించారు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, తండ్రిగా, తమ్ముడిగా, అన్నగా.. ఇలాంటి పలు క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలు పోషించారు. హీరోగా రాణించాలనే తన కోరిక మాత్రం తీరలేదు. అయినా ఇండస్ట్రీలో



తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సీనియర్ నటుడు శరత్ బాబు కన్నుమూతతో.. అతని వ్యక్తిగత విషయాలపై ఆసక్తి నెలకొంది. శరత్ బాబుకు రెండు పెళ్లిళ్లు అయ్యాయి. ఇద్దరికీ విడాకులు ఇచ్చారు. మొదటి భార్య మాత్రం రమా ప్రభ. అందరికీ తెలిసిన తెలుగు నటి. 1974లో లేడీ కమెడియన్ రమాప్రభను పెళ్లి చేసుకున్న శరత్ బాబు.. 1988లో ఆమెతో విడిపోయారు. 1990లో స్నేహ నంబియార్ అనే మహిళను పెళ్ళాడి 2011లో ఆమెకు కూడా డివోర్స్ ఇచ్చారు. రమాప్రభ సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టిన పదేళ్ల తర్వాత శరత్ బాబు సినీ నటుడిగా ఎంట్రీ ఇచ్చారు. వీళ్లిద్దరు జంటగా కొన్ని సినిమాల్లో నటించారు. ఆ పరిచయం ప్రేమగా మారి.. 1974లో రెండు కుటుంబాల అంగీకారంతో.. పెళ్లి వరకు వెళ్లింది. కొన్నాళ్లు సాఫీగా సాగిన సంసారం.. తర్వాత మనస్పర్థల కారణంగా విడిపోయారు. తన డబ్బు, సినిమాల్లో అవకాశాల కోసమే తనను ప్రేమించి పెళ్లి చేసుకున్నట్టు రమాప్రభ ఓ సందర్భంలో వ్యాఖ్యలు చేయటం విశేషం. విడాకుల తర్వాత శరత్ బాబు మరో అమ్మాయిని పెళ్లి చేసుకోగా.. రమాప్రభ మాత్రం ఒంటరిగా ఉండిపోయింది. వీరికి పిల్లలు లేరు. దీంతో రమాప్రభ ఓ అమ్మాయిని దత్తత తీసుకున్నారు. పేరు విజయ చాముండేశ్వరి. ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్‌కు భార్య.

# బ్రహ్మానందం ఇంట పెళ్లిసందడి

### రెండో కొడుకు సిద్దార్థ్ నిశ్చితార్థం

ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం రెండో కుమారుడు సిద్దార్థ్ త్వరలో పెళ్లి పీటలెక్కనున్నారు. హైదరాబాద్ చెందిన డాక్టర్ పద్మజా వినయ్ కుమార్తె, డాక్టర్.ఐశ్వర్యను ఆయన వివాహం చేసుకోనున్నారు. ఈ సందర్భంగా వీరి నిశ్చితార్థ వేడుక



హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఇరు కుటుంబ సభ్యులు, సన్నిహితులతోపాటు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ఈ వేడుకలో పాల్గొని కాబోయే దంపతులను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన ఫొటోలు తాజాగా బయటకు వచ్చాయి. పలువురు నెటిజన్లు నూతన జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు. హాస్య నటుడు బ్రహ్మానందానికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు గౌతమ్ పలు చిత్రాల్లో హీరోగా నటించారు. రెండో తనయుడు సిద్దార్థ్.. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. త్వరలోనే సిద్దార్థ్, ఐశ్వర్యల వివాహం జరగనుంది. ఈ జనరేషన్ ఫిల్మ్ మేకర్స్ బ్రహ్మానందం యొక్క ప్రతిభను వినియోగించుకోలేక పోతున్నారు అనేది ఒక విమర్శ. బ్రహ్మానందం సినిమాలు లేకున్నా ఆయన ఫోటోలు మరియు వీడియోలు మీమ్స్ రూపంలో ఈ తరం ప్రేక్షకులను నవ్వించడంతో పాటు ఆలోచింపజేస్తున్నాయి అనడంలో సందేహం లేదు. బ్రహ్మానందం కి ఇద్దరు కుమారులు. పెద్దబ్బాయి గౌతమ్ ఇప్పటికే పెళ్లి చేసుకుని



తండ్రి కూడా అయ్యారు. హీరోగా కొన్ని సినిమాల్లో నటించి ప్రయత్నించిన గౌతమ్ ఈ మధ్య కాలంలో సినిమాలకు దూరంగా ఉంటున్నాడు. ఇప్పుడు చిన్నబ్బాయి సిద్దార్థ్ పెళ్లి పీటలు ఎక్కేందుకు సిద్ధం అయ్యాడు.

పెళ్లి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్రహ్మానందం కి ఇండస్ట్రీలో ఉన్న సన్నిహితుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కనుక సిద్దార్థ్... ఐశ్వర్య ల వివాహ మహోత్సవానికి ఎంతో మంది ప్రముఖులు హాజరు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## నిర్మాత డివివి దానయ్య తనయుడి వివాహం

ప్రముఖ నిర్మాత డీవీవీ దానయ్య ఇంట పెళ్లి బాజాలు మోగాయి. ఆయన తనయుడు కల్యాణ్ ఓ ఇంటివాడయ్యాడు. వేదమంత్రా సాక్షిగా సమత మెడలో మూడు ముళ్లు వేశాడు. కల్యాణ్ – సమతల వివాహం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు టాలీవుడ్ నుంచి పలువురు సినీ సెలబ్రిటీలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హీరోలు పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్, దర్శకులు రాజమౌళి, త్రివిక్రమ్, ప్రశాంత్ నీల్, తదితరులు ఈ వివాహ వేడుకకకు హాజరై సందడి చేశారు. ప్రస్తుతం ఈ వివాహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.



PRINTED AND PUBLISHED BY VNARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO , RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com